J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 42 సంచిక : 15 16.9.2022, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## బీజేపీ - టీడీపీ కలవకుండా ఉండాలంటే..

# 'ముందస్తు'తోనే ముందరకాళ్ళకు బంధం

- వైసీపీ కొత్త వ్యూహం - పార్టీ శ్రేణులతో జగన్ చర్చ
- గెలుపుపై అనుమానం ఉన్న చోట ఇన్‌ఛార్జుల నియామకం
- పార్టీ అంతర్గత ప్రక్షాళన దిశగా ఇప్పటికే అడుగులు
- అసెంబ్లీ, పార్లమెంటులకు వేరువేరుగా పోటీచేసే యోచన
- మరోసారి తమ బలాన్ని చూపి పొత్తు అడ్డుకునే ఆలోచన



*బీజేపీ, టీడీపీ కలుస్తాయా...? ఒకవేళ ఆ రెండుపార్టీలు కలిస్తే బీజేపీ, టీడీపీ, జనసేన కలిసి పోటీ చేస్తాయా...?? ఆలాచేస్తే **175**కి **175** రావాలంటున్న జగన్ కోరిక నెరవేరుతుందా..??? ఇలాంటి అనేక భేతాళ ప్రశ్నలు ఇప్పుడు ఆంధ్రలోని రాజకీయవర్గాల నుండే కాకుండా సామాన్య ప్రజల నుండి కూడా వినపడుతున్నాయి. ఎక్కడ ఏ నలుగురు గుమికూడినా ఇదే చర్చ వినపడుతోంది. భవిష్యత్‌లో రాబోయే ఎన్నికల గురించే చర్చించుకుంటున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడి **40**నెలలే గడిచింది. నిజానికి ఎన్నికలకు ఇంకా **20** నెలలు గడువుంది. కానీ **6** నెలల ముందే, అంటే **2023** డిసెంబర్‌లోగా శాసనసభ ఎన్నికలకు వెళ్లే దిశగా వైసీపీ అడుగులు వేయబోతున్నట్లు విశ్వసనీయ సమాచారం.*

10లో



## ఆయన రూపం..
# ఇక 'అమరదీపం'
## దివికేగిన నట దిగ్గజం

రౌద్రనటుడిగా.. 'ప్రళయరుద్రుడు'గా.. 'తాండ్రపాపారాయుడు'గా, 'రంగూన్ రౌడీ'గా, 'సీతారాముడి'గా... ఇలా ఎన్నో పాత్రల్లో విశేష నటనాచాతుర్యంతో అశేష ప్రేక్షకలోకాన్ని ఉర్రూతలూగించిన మొగల్తూరు మొనగాడు.. ఇక లేరు. 'రెబల్‌స్టార్'గా పేరుగడించి, 'భక్త కన్నప్ప' వంటి కరుణార్ద్రపూరితమైన పాత్రల్లో రాణించిన నవరస నటనాధురీణుడు..కృష్ణంరాజు శివైక్యం చెందారు.

10లో



Happy
80th
Birthday

కళారాధకులు, కళాపోషకులు, ఆధ్యాత్మిక సేవాతత్పరులు,
రాజకీయ, సినీ, సాహిత్య, సాంస్కృతిక, వ్యాపార, సేవా రంగాలలో
తన ప్రతిభను చాటుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి
మాజీ రాజ్యసభ సభ్యులు

డాక్టర్ తిక్కవరపు సుబ్బరామిరెడ్డి గారు

సెప్టెంబర్ 17, 2022న
80వ ఏట అడుగిడబోతున్న శుభతరుణంలో
పుట్టినరోజు శుభాకాంక్షలు.

సుబ్బరామిరెడ్డి అభిమానులు
నెల్లూరు.

## మాంసం.. కాదు
# 'మోసం మార్కెట్లు'

- కుళ్ళిపోయి.. పురుగులు పట్టిన మటన్ అమ్ముతున్నారు
- దుకాణాలు పరిశీలించి నివ్వెరపోయిన అధికారులు



**కుళ్ళిపోయి పురుగులు పట్టిన మాంసాన్ని అనేక మాంసం దుకాణాల వారు దర్జాగా అమ్మేసుకుని సొమ్ము చేసుకుంటున్నారు. ప్రజల ఆరోగ్యం ఎటుపోతేనేం.. లాభార్జనే ధ్యేయం అన్నట్లుగా దుకాణాల యజమానులు ప్రజలకు మంచి మాంసం పేరుతో కుళ్లిపోయిన మాంసాన్ని అంటగట్టి కుచ్చుటోపీ పెట్టేస్తున్నారు. సాక్షాత్తూ అధికారులే ఈ దుర్గంధ భాగోతాన్ని బయటపెట్టారు.**

నెల్లూరు నగరంలోని అనేక మాంసం దుకాణాల్లో ఫ్రిజ్‌లో విక్రయానికి సిద్ధంగా ఉంచిన, గబ్బుకొడుతున్న కిలోలకొద్దీ మాంసాన్ని చూసి అధికారులు నివ్వెరపోయారు. నెల్లూరు నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారి డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి, విజిలెన్స్ సిఐ సుధాకర్‌రెడ్డి, కల్తీఆహారం నియంత్రణాధికారులు నీరజ, విష్ణు, స్రవంతి, శానిటరీ సూపర్‌వైజర్ కృష్ణారెడ్డి తదితరులంతా ఇటీవల నగరంలో పర్యటించి చికెన్, మటన్, చేపల దుకాణాలపై ఆకస్మిక దాడులు చేశారు. అనేక దుకాణాల్లో ఫ్రిజ్‌లలో ఉంచిన మాంసాన్ని చూస్తే, పురుగులు పట్టిపోయి, కుళ్ళిపోయి కంపుకొడుతోంది. అది చికెనో, మటనో ఏదైతేనేం..రోజుల తరబడి నిల్వ ఉంచిన ఆ మాంసాన్ని చూసి, ఇది ప్రజలు తింటే ఇంకేమైనా ఉందా?..అంటూ దుకాణాదారులపై మండిపడ్డారు. ట్రేడ్ లైసెన్సులు లేకుండా, నిబంధనలు పట్టించుకోకుండా, పరిశుభ్రత పాటించకుండా తమ చిత్తానుసారం వ్యవహరిస్తున్న 43 దుకాణాల వారికి కొద్దిపాటి మొత్తాలను జరిమానాలుగా విధించారు. ఇకపై నిల్వచేసిన మాంసాన్ని విక్రయిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. అయినా, ఇలా ఎన్నిసార్లు దాడులు చేసినా వ్యాపారులు ఇలాంటి అక్రమాలకు పాల్పడడం మానుకోవడం లేదు. గతంలో నగరంలోనూ, జిల్లావ్యాప్తంగా ఎన్నోసార్లు దాడులు, తనిఖీలు ముమ్మరంగానే జరిగాయి కానీ, పరిస్థితి మళ్ళీ మొదటికి వచ్చింది. ఎప్పుడైనా అధికారులు పట్టుకున్నప్పుడు, జరిమానాలు కట్టడం వారికి లెక్కేలేదు. ఆ డబ్బు కోసం కూడా మాంసం ధరలు పెంచేసి, ప్రజల నెత్తికి చుట్టేయడం సర్వసాధారణమైపోయింది. ప్రజారోగ్యం దృష్ట్యా ఇలాంటి వ్యాపారులపై ప్రభుత్వం ఇకనైనా కఠిన చర్యలు తీసుకోవాలి. అవసరమైతే చట్టాల్లో కూడా మార్పులు చేయాలి. ఒక్క మాంసం దుకాణాలపైనే కాదు, అన్నిరకాల కల్తీలపై కూడా చర్యలు కఠినంగా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారు.



## రుద్రకోటలో.. అంకమ్మ తిరునాళ్ళ

### స్త్రీల వేషధారణతో పురుషులు

కావలి మండలంలోని రుద్రకోట గ్రామంలో గ్రామదేవత అంకమ్మ ఉత్సవాలు ఇటీవల వైభవంగా జరిగాయి. అయిదేళ్ళకోసారి జరిగే అమ్మవారి తిరునాళ్ళ, కోవిడ్ కారణంగా ఏడేళ్ళ తర్వాత జరగడంతో భక్తజనం పోటెత్తారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఆలయ అర్చకులు శోభాయమానంగా అలంకరించి ప్రత్యేకపూజలు చేశారు. ఈ తిరునాళ్ళలో ఆచారం ప్రకారం ఎంతోమంది పురుషులు స్త్రీల వేషధారణలతో పాల్గొనడం విశేషం. చేటలు పట్టుకుని నృత్యాలు చేస్తూ వారు అందరినీ అలరించారు కూడా.

## ముందరపాట్టెమ్మ తల్లికి.. ప్రత్యేకపూజలు

కావలి రూరల్ మండలం, అన్నగారి పాళెం గ్రామసమీపంలో కొలువై ఉన్న ప్రసిద్ధ గ్రామదేవత శ్రీ ముందరపాట్టెమ్మ అమ్మవారికి ఈనెల 11న భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద పొంగళ్ళు వండి అమ్మవారికి నైవేద్యం సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించారు.

## 'గురుప్రపూర్ణోత్తముడు'.. మోపూరు వేణుగోపాలయ్య

### - జయంతి సభలో కొనియాడిన వక్తలు



తాను విశ్రాంత అధ్యాపకుడే అయినప్పటికీ, అవిశ్రాంతంగా సరస్వతీ సమాజంలో సుమారు పాతికేళ్ళపాటు అత్యద్భుత ఆధ్యాత్మిక ఉపన్యాసాలతో ప్రజలకు ధార్మికబోధలు చేసిన నిరంతర జ్ఞానబోధకుడు, అధ్యాపకునిగా ఉన్నప్పుడు ఎంతోమంది విద్యార్థులను, ఉపాధ్యాయులను ఉత్తమంగా తీర్చిదిద్దిన గురువు, ప్రముఖ సారస్వతవేత్త, విఆర్ కళాశాల విశ్రాంత తెలుగు అధ్యాపకులు, దివంగత మోపూరు వేణుగోపాలయ్య 'గురుప్రపూర్ణోత్తముడు'గా అందరి ప్రశంసలందుకుంటున్నారని వక్తలు కొనియాడారు. ఇటీవల నెల్లూరు మూలాపేటలో ఉన్న శ్రీ అన్నదేవుల గోవిందరెడ్డి సరస్వతి సమాజంలో మోపూరు వేణుగోపాలయ్య 82వ జయంతి సభ ఘనంగా జరిగింది. ప్రముఖ సాహితీవేత్తలు, విశ్రాంత ఆచార్యులు గుంజి వెంకటరత్నం (వరంగల్లు), విఆర్ కళాశాల విశ్రాంత ఆచార్యులు మెట్టు రామచంద్రప్రసాద్, వర్ధమాన సమాజం కార్యదర్శి మజ్జిగ ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఈ సభలో ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. సహృదయుడు, సౌజన్యశీలి అయిన మోపూరు వేణుగోపాలయ్య విశిష్ట వ్యక్తిత్వాన్ని ప్రస్తావిస్తూ, ఆయన చేసిన సాహితీసేవలు నేటి సమాజానికి మార్గదర్శకమని ప్రస్తుతించారు. సరస్వతీసమాజం అధ్యక్ష కార్యదర్శులు మోపూరు పెంచలయ్య, తుమ్మతాటి రమణయ్యల సారధ్యంలో ఏర్పాటైన ఈ సభలో మోపూరు వారి స్మారకంగా, 109సార్లు రక్తదానం చేసిన రక్తదాత మదనపల్లి మధుసూదనరావును, ప్రముఖ తబలా విద్వాంసులు వడిగల మోహన జనార్ధన్‌లను శాలువలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు పుస్తక బహుమతులను, టెన్త్‌లో ఉత్తమ మార్కులు సాధించిన పలువురు విద్యార్థినీ విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు. సమాజం ఉపాధ్యక్షులు బండ్ల రమణయ్య, మోపూరు వేణుగోపాలయ్యకు ఆత్మీయులైన విఆర్‌సి విశ్రాంత అధ్యాపకులు కొండా వెంకటస్వామి, టిటిడి విశ్రాంత కోఆర్డినేటర్ మల్లేల శ్రీహరి, ప్రపంచ తెలుగు సమాఖ్య రీజనల్ ఛైర్మెన్ నలుబోలు బలరామయ్యనాయుడు, ప్రముఖ సాహితీవేత్తలు గంగిశెట్టి శివకుమార్, గుర్రం సీతాదేవి, బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, నెరసం అధ్యక్షుడు అనుమల జయప్రకాష్, పెరసం అధ్యక్షురాలు గోవిందరాజు సుభద్రాదేవి పాల్గొన్నారు.

# నెమలీకలపై.. స్వాతంత్ర్యయోధుల చిత్రాలు

**అబ్బురపరిచే చిత్రాలతో, చిత్రకళలో తనదంటూ ప్రత్యేకమైన రీతిలో ఎన్నో అపురూప చిత్రాలను రూపుదిద్దుతూ, చిన్నవయసులోనే విశిష్టమైన అవార్డులను సైతం సొంతం చేసుకుంటూ అందరి అభినందనలు అందుకుంటోంది నెల్లూరుకు చెందిన విద్యార్థిని ఉజ్వల ఖ్యాతి. జాతీయ నాయకుల చిత్రాలను, వారి రూపురేఖలను కళ్ళకు కట్టినట్లుగా చిత్రించడంలో ఉజ్వల చిత్రకళా నైపుణ్యం అమోఘం!... అందులోనూ రావి ఆకులపై, నెమలీకలపై చిత్రాలు వేయడమంటే.. అదొక గొప్ప కళ. ఎంతో కష్టసాధ్యమైన ఈ కళలో అద్వితీయమైన ప్రతిభతో వేసిన ఆమె చిత్రాలకు 'ప్రపంచ మిరకిల్ అవార్డు'తో పాటు, హైదరాబాద్‌లోని యంగ్ ఎన్వాయిస్ ఇంటర్నేషనల్ సంస్థనుంచి 'గోల్డ్‌మెడల్' కూడా రావడం ఉజ్వలఖ్యాతి చిత్రకళా ప్రతిభకు నిదర్శనం.**



- అంతర్జాతీయస్థాయిలో 'మిరకిల్ అవార్డు'
- చిత్రకళలో గోల్డ్‌మెడల్
- 'ఉజ్వల ఖ్యాతి'.. ప్రతిభ



నెల్లూరుకు చెందిన ఉజ్వలఖ్యాతికి చిన్నతనం నుంచి చిత్రకళ అంటే ఎంతో ఇష్టం. తల్లితండ్రులు చెంచులక్ష్మి-ఎన్.సునీల్‌కుమార్‌ల ప్రోత్సాహంతో, గురువుల సహకారంతో చిత్రకళలో శిక్షణ పొందుతూ, ఎంతో కష్టపడి ఆ కళలో అద్వితీయమైన నైపుణ్యం సాధిస్తోంది. నగరానికి చేరువలో కనుపర్తిపాడు వద్ద ఉన్న 'ఇథాకా స్కూల్'లో ఇంటర్ చదువుతున్న ఉజ్వల చదువులోనూ ముందుంటూ, చిత్రకళలోనూ ప్రతిభతో రాణిస్తోంది. అందులోనూ జాతీయనాయకులు, స్వాతంత్ర్యసమరయోధులు తదితర మహనీయుల చిత్రాలను వేయడమంటే ఉజ్వలకు మరెంతో ఇష్టం. అలా ఇప్పటికే ఎందరో దేశభక్తుల చిత్రాలను ఎంతో బాగా చిత్రించి, ప్రపంచస్థాయిలో ప్రతిష్టాత్మకమైన 'మిరకిల్ వరల్డ్ రికార్డు'ను కూడా సొంతం చేసుకుంది. చిత్రకళలో నిరంతర సాధన చేస్తూ, పేరుకు తగ్గట్టుగానే చిత్రకళా రంగంలో ఉజ్వల ఎంతో ఖ్యాతి పొందుతుండడం విశేషం.

### రావి ఆకులపై స్వాతంత్ర్యయోధులు

చిత్రకళలో ఎంతో ప్రత్యేకత ఉన్న 'తంజావూర్ ఆర్కిలిక్ పెయింటింగ్'లో కూడా ఉత్తమ శిక్షణ పొందిన అనంతరం, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే డ్రాయింగ్ కోర్సులో లోయర్-హయ్యర్ గ్రేడ్‌లలో ఉత్తీర్ణత సాధించి, తన చిత్రకళా నైపుణ్యానికి మెరుగులు దిద్దుకుంది ఉజ్వల ఖ్యాతి. ఈ ఏడాది 73వ స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా 73 మంది జాతీయనాయకులు, స్వాతంత్ర్యసమరయోధుల చిత్రాలను ఎంతో కష్టసాధ్యమైనప్పటికీ, రావి ఆకులపై అందంగా రూపుదిద్ది 'మిరకిల్' ప్రపంచ రికార్డును సాధించింది. అంతే కాక, ఇటీవల హైదరాబాద్‌లో 'అజాదీ కా అమృత్ మహోత్సవాల' సందర్భంగా 'యంగ్ ఎన్వాయిస్ ఇంటర్నేషనల్' సంస్థ నుంచి చిత్రకళలో 'గోల్డ్‌మెడల్'ను కూడా సాధించి చిత్రకళా రంగంలో నెల్లూరుకు ఉజ్వలమైన కీర్తి తెచ్చింది.

### నెమలీకలపై అద్భుత చిత్రాలు

ఇటీవల మరో సరికొత్త ప్రయోగంగా 'నెమలీకలపై అద్భుతచిత్రాలు' వేయడంలో నైపుణ్యం సాధించి, 75 ఏళ్ళ స్వాతంత్ర్య దినోత్సవ అమృతోత్సవాల సందర్భంగా 75 మంది దేశనాయకులు, స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలను అలవోకగా, అద్భుతంగా చిత్రించి అందరి ప్రశంసలు అందుకుంటోంది ఉజ్వల. నెమలి పింఛాలను సేకరించి వాటిపై చిత్రాలు వేయడమంటే ఎంతో క్లిష్టమైన కళ. అందుకు ఎంతో ఓర్పు, నేర్పు ఉండాలి. నెమలీకలనే కాన్వాసుగా చేసుకుని ఎంతో ఒడుపుగా, అత్యంత వేగంగా.. కేవలం 7 నిమిషాల వ్యవధిలోనే చిత్రం రూపొందించడంలో ఉజ్వల చిత్రకళాప్రతిభ అనన్యసామాన్యం. అందులోనూ జాతీయనాయకులు, స్వాతంత్ర్యసమరయోధుల చిత్రాలను వేయడం ఉజ్వల కళాసక్తికే కాదు, దేశ భక్తికి కూడా నిదర్శనం. ఎంతో సున్నితంగా ఉండే రావి ఆకుల మీద. నెమలి ఈకల మీద చిత్రాలు వేయాలంటే చిత్రకళలోనే కాదు..సూక్ష్మకళలోనూ ప్రతిభ, నైపుణ్యాలు ఉండాలి. నిరంతరం ఎంతో కృషి-పట్టుదల కూడా ఉంటేతప్ప ఇవి సాధ్యం కాదు. అలాంటి అరుదైన చిత్రకళను సొంతం చేసుకుంటూ తనదంటూ ప్రత్యేకతమైన కళతో రాణిస్తున్న ఉజ్వల ఖ్యాతి, సింహపురి సీమకే కాక రాష్ట్ర జాతీయస్థాయిలోనూ గొప్పగా ఉండేలా మరిన్ని అపురూప చిత్రాలు వేయాలనే సంకల్పంతో కృషి చేస్తుండడం అభినంద నీయం!.. ఉజ్వల కృషి, ఆకాంక్ష ఫలించాలని ఆశిద్దాం!..

# పోలేరమ్మ జాతరకు.. పోటెత్తిన భక్తజనం



- వెంకటగిరిలో అంబరాన్నంటే సంబరం
- పాల్గొన్న అంతర్జాతీయ క్రీడాకారిణి పి.వి.సింధు



అందరినీ కాపాడే చల్లనితల్లి, ఆపద్బాంధవి, కరుణామయి.. వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ అమ్మవారి జాతర ఈనెల 14, 15 తేదీల్లో అంగరంగ వైభవంగా జరిగింది. రెండు రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగిన పోలేరమ్మ జాతరకు భక్తజనం పోటెత్తారు. 'అమ్మా! పోలేరమ్మా.. కాపాడమ్మ'..అంటూ భక్తులు పెద్దపెట్టున కోరుకుంటూ, జాతరలో దేదీప్యమానంగా దర్శన మిచ్చిన అమ్మవారిని కన్నులారా దర్శించుకుని తరించారు. తిరుపతి జిల్లా, నెల్లూరు జిల్లాల నుంచి వేల సంఖ్యలో భక్తులు వెంకటగిరి జాతరకు తరలిరావడంతో ఆలయ ప్రాంతంతో పాటు పురవీధులన్నీ భక్తులతో క్రిక్కిరిసిపోయాయి. గురువారం సాయంత్రం పెద్దఎత్తున జరిగిన జాతరలో అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి.సింధు కుటుంబసభ్యులు, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి తదితర ప్రముఖులతో కలసి అమ్మవారిని దర్శించుకున్నారు! వెంకటగిరిలో పండుగ సంబరంగా ఈ వేడుక జరిగింది. ప్రతి ఇంటా వేపమండలు కట్టి, అమ్మవారిని ప్రార్థిస్తూ పూజలు చేసి, నైవేద్యం సమర్పించు కున్నారు. పొంగళ్ళు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. జాతర సంరంభం ఎంతో కోలాహలంగా జరిగింది. ఆలయప్రాంగణం విద్యుద్దీపాలంకరణలతో శోభయమానమైంది. సుగంధ పుష్పమాలి కలతో, స్వర్ణాభరణాలతో అమ్మవారి విగ్రహాన్ని వైభవోపేతంగా అలంకరించి అర్చకులు ప్రత్యేకపూజలు చేశారు. జీనిగలవారి వీధిలో అమ్మవారిని ప్రతిష్ఠించి ఎంతో భక్తిశ్రద్ధలతో విశిష్ట పూజలు నిర్వహించారు. వేపమండలతో ఏర్పాటుచేసిన చలువ పందిళ్ళ కింద కొలువైన అమ్మవారిని దర్శించుకున్న భక్తుల ఆనందం అంతా ఇంతా కాదు. బుధవారం రాత్రి అమ్మవారికి పూలరథంపై కన్నులపండువగా జరిగిన ఊరేగింపులో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. గురువారం రాత్రి జరిగిన భారీ ఊరేగింపులో అమ్మవారి వైభవాన్ని చూడడానికి రెండు కళ్ళూ చాలవు. బ్యారికేడ్లు నిర్మించి ఆలయ నిర్వాహకులు భక్తులకు ఇబ్బంది లేకుండా క్యూలైన్లు ఏర్పాటుచేశారు. వెంకటగిరి సంస్థానాధీశులు రాజా సర్వజ్ఞకుమార యాచేంద్ర సంప్రదాయబద్ధంగా అమ్మవారికి చీర సారెలందించారు. వెంకటగిరి ఎమ్మెల్యే, మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్వయంగా దగ్గరుండి అన్ని కార్యక్రమాలు సజావుగా ఉండేలా అధికారులకు, ఆలయ సిబ్బందికి ఎప్పటికప్పుడు ఆదేశాలిస్తూ అమ్మవారి జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పెద్దఎత్తున బందోబస్తు నిర్వహించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, పోలేరమ్మ దేవస్థానం ఛైర్మన్ మురళీకృష్ణ, ఆనం కుటుంబసభ్యులు తదితర ప్రముఖులంతా అమ్మవారిని దర్శించుకున్నారు.

## పోలేరమ్మ స్వర్ణకిరీటానికి..

## లక్షా వెయ్యిన్నూట పదహార్లు

**డిసిసి నేత చేవూరు వితరణ**



వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ అమ్మవారికి స్వర్ణకిరీటం కోసం తన వంతుగా నెల్లూరుజిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి లక్షా వెయ్యిన్నూట పదహారు రూపాయలను విరాళంగా సమర్పించుకున్నారు. ఈనెల 15వ తేదీ గురువారం నాడు వెంకటగిరిలో పోలేరమ్మ జాతరకు వెళ్ళి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆయన తన విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు అందజేశారు. రాష్ట్ర ప్రజలందరికీ పోలేరమ్మతల్లి ఆశీస్సులు ఉండాలని, అదేవిధంగా అఖిలభారత కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ చేపట్టిన 'భారత్ జోడో' పాదయాత్ర విజయవంతం కావాలని పోలేరమ్మ అమ్మవారిని ప్రార్థిస్తున్నానని ఆయన తెలిపారు.



పెన్నానది వరదనీటిలో చిక్కుకున్న నలుగురు పిల్లలను పడవలో ఒడ్డుకు చేర్చుతున్న మత్స్యకారులు

# నాయకుడంటే.. ఇలా ఉండాలి

- పెన్నా వరదలో చిక్కుకున్న నలుగురు బాలలు
- ఎమ్మెల్యే ప్రసన్న చొరవతో అందరూ సురక్షితం



*తమ నియోజకవర్గాల్లో ఎక్కడేం జరిగినా, ఎవరికేం జరిగినా చీమకుట్టినట్లు కూడా లేకుండా.. తమ పనులేవో తాము చక్కబెట్టు కుంటూ కాలం గడిపేసే నాయకులెందరో ఉన్న నేటికాలంలో.. పిలిస్తేనే కాదు, తెలిస్తేనే చాలు.. 'నేనున్నా'నంటూ ప్రజలను ఆపదల్లో ఆదు కుంటూ అందరి ప్రశంసలందుకుంటున్నారు కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న. ఇటీవల నలుగురు పిల్లలెవరో పెన్నానదిని దాటుతుండగా ప్రమా దంలో పడ్డారని, ఎవరో ఫోన్ చేసి చెప్పడంతోనే వెంటనే ఆయన స్పందించారు. తాను అధికారిక కార్యక్రమాల్లో హడావుడిగా ఉన్న ప్పటికీ, సంబంధిత అధికారులను అప్పటికప్పుడు పురమాయించి పరుగులు తీయించారు. ఎట్టయితేనేం ఆపదలో ఉన్నవారిని ఒడ్డుకు చేరేలా చేశారు. ఆ నలుగురు బాలల్నీ కాపాడేలా చర్యలు తీసుకుని అందరి అభిమానానికి పాత్రులయ్యారు. ప్రజలకు ఇబ్బందులు కలిగినప్పుడు నాయకులన్నవారికి వెంటనే స్పందించే గుణం ఉంటే..ఎంత మేలో నిరూపించిన ఆ సంఘటన వివరాలిలా ఉన్నాయి.*

విడవలూరు మండలంలోని ఊటుకూరు పంచాయతీ కంచరపాళెనికి చెందిన బద్దెపూడి మునిభరత్, బద్దెపూడి అనిల్, బిరుదవోలు అభిలాష్, కొమ్మ ప్రవీణ్..ఈ నలుగురు బాలలు కలసి ఇందుకూరుపేట మండలం నిడిముసిలి గ్రామానికి బంధువులింటికి బయలుదేరారు. మధ్యలో పెన్నానదిని దాటుతుండగా, ఉన్నట్లుండి వరదనీటి ఉధృతి పెరగడంతో ఆ ప్రవాహంలో చిక్కుకుపోయారు. ఆ ప్రాంతంలో ఉన్న మహిళలెవరో చూసి, వెంటనే వైకాపా నాయకులకు తెలియజేయగా, వాళ్ళు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి ఫోన్ చేసి ఆ బాలలను కాపాడాలని కోరారు. ఆ సమయంలో ఎమ్మెల్యే పార్లపల్లి గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో బిజీగా ఉన్నా, బాలలు నదిలో చిక్కుకున్నారని తెలియగానే వెంటనే అక్కడున్న అధికారులను సంఘటనా ప్రాంతానికి పరుగులు పెట్టించారు. ఈలోగా ఆ బాలలు నదిలో ఉన్న ఇసుకదిబ్బ మీదికి చేరుకున్నారు. ప్రవాహం పెరగడంతో ఆ దిబ్బ కూడా నీళ్ళలో మునిగిపోతుండడంతో ప్రాణభయంతో పెద్దగా కేకలు వేస్తున్నారు. తహశీల్దార్ చంద్రశేఖర్, సిఐ కోటేశ్వరరావు, ఎస్ఐ ఆనందభాస్కర్‌బాబుతో పాటు పలువురు పోలీసులు, రెవెన్యూ సిబ్బంది అందరూ ఎమ్మెల్యే ఆదేశాలతో అత్యంత వేగంగా పెన్నానది వద్దకు చేరుకుని, మత్స్యకారులతో మాట్లాడి, రెండు బోట్లను కూడా నదిలోకి పంపారు. ఎట్టయితేనేం అందరూ కలసి కొంతసేపటికి ఆ బాలలను సురక్షితంగా గట్టుకు చేర్చారు. బాలలను కాపాడిన ఎమ్మెల్యే ప్రసన్నకు అందరూ తమ కృతజ్ఞతలు తెలిపారు.

# స్థలం ఓకే.. 17న స్వీకారం

**'సరస్వతినగర్'లో కొలువుతీరనున్న తెలుగుభాషా సరస్వతి**

ఎట్టయితేనేం.. సుదీర్ఘకాలం నిరీక్షణ ఫలించి, ఎట్టకేలకు ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం భవనాల సముదాయానికి అవసరమైన స్థలానికి మోక్షం వచ్చింది. ఆ కేంద్రం ఏర్పాటుకు కావాల్సిన స్థలాన్ని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా కేటాయించిన విషయం తెలిసిందే. వెంకటాచలం మండలంలోని కనుపూరు బిట్-2లో జాతీయరహదారి వద్ద ఉన్న సరస్వతినగర్‌లో 5 ఎకరాల 5 సెంట్ల భూమిని ఆ కేంద్రానికి కేటాయించారు. దీంతో, ఆ స్థలానికి సంబంధించిన ధృవీకరణ పత్రాల స్వీకారం కార్యక్రమం ఈనెల 17వ తేది శనివారం ఉదయం 10.30 గంటలకు ఆ స్థలంలోనే జరిగే సమావేశంలో నిర్వహిస్తామని ఆ కేంద్రం డైరెక్టర్ ఆచార్య డి.మునిరత్నంనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, భారతీయ భాషాసంస్థ సంచాలకులు ఆచార్య శైలేంద్ర మోహన్, ప్రాచీన భాషల శాఖాధిపతి ఆచార్య సివి శివరామకృష్ణతో పాటు నెల్లూరు ఆర్డీఓ మలోల, వెంకటాచలం తహశీల్దార్ నాగరాజు తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని, తెలుగు భాషాభిమానులు, కవులు, కవయిత్రులు, కవిపండితులు అందరూ విచ్చేసి సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

## 26 నుంచి పిల్లలకు..దసరా సెలవులు

దసరా పర్వదినాలను పురస్కరించుకుని రాష్ట్రప్రభుత్వం అన్ని పాఠశాలలకు సెప్టెంబరు 26వతేదీ నుంచి అక్టోబర్ 6వ తేదీ వరకు సెలవులు ప్రకటించింది. క్రిస్టియన్, మైనార్టీ స్కూళ్ళకు మాత్రం అక్టోబర్ 1 నుంచి 6వ తేదీ వరకు సెలవులిచ్చారు.

## అక్టోబరు 2 నుంచి..

# 'అక్షరచైతన్యం'

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేసేందుకు జిల్లాలో మళ్ళీ అక్షరయజ్ఞం ప్రారంభం అవుతోంది. అక్టోబర్ 2వ తేది గాంధీ జయంతి రోజు నుంచి జిల్లాలోని 37 మండలాల్లో అక్షరకేంద్రాల తరగతులు ప్రారంభం కానున్నాయి. గతంలో అక్షరాస్యత కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా అక్షరాస్యత 68 నుంచి 84 శాతానికి పెరిగిన నేపథ్యంలో, పూర్తి స్థాయిలో అక్షరాస్యతను పెంపొందించేందుకు జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు ఆధ్వర్యంలో అక్షరయజ్ఞం-2కు శ్రీకారం చుట్టారు. ఈనెల 14న ఆమేరకు 'అక్షరచైతన్యం-2' పోస్టర్లను కలెక్టర్ జిల్లా అధికారులతో కలసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ వెంకటనారాయణమ్మ, డిపిఓ ధనలక్ష్మి, డిఆర్‌డిఏ పి.డి సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రెండ్స్ వాకర్స్.. ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే



నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15 గురువారం నాడు ఇంజనీర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రఖ్యాత ఇంజనీర్, భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఆయనకు వాకర్స్ సంఘం వారు నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తుకు తెచ్చుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షులు కొండూరు సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వాకర్స్ సభ్యులైన ఏడుగురు ఇంజనీర్లను సత్కరించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ ట్రెజరర్ నలుబోలు బలరామయ్యనాయుడు, ఇంజనీర్లు లక్కాకుల శ్రీనివాసులు, విజయరాఘవేంద్ర, జివి కృష్ణయ్య, మాగంటి ప్రసాద్, గోతం వెంకటేశ్వర్లు, పులగల సుబ్బారావు, శ్రీనివాసులుతో పాటు సంఘం కార్యదర్శి దాసరాజు సత్యనారాయణ, కోశాధికారి రావూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

లాయర్
సెప్టెంబర్ 16, 2022

# రుణాల పేరుతో ప్రాణాలు తీస్తున్న..'యాప్'లు

నేటి ఆధునిక కాలంలో శాస్త్రసాంకేతిక విజ్ఞానం బాగా పెరిగిపోయి, సెల్‌ఫోన్లు వచ్చి అరచేతిలో ప్రపంచం చూపిం చేస్తున్నాయని జనం మురిసిపోతున్న తరుణంలో, ఇదే సందని అక్రమార్కులు డిజిటల్ మోసాలకు తెరలేపారు. రకరకాల యాప్‌లను ప్రవేశపెట్టి ఏదో ఒకరకంగా డబ్బు లాగేసుకుని జనానికి కుచ్చుటోపీ పెట్టేస్తున్నారు. ఎక్కడో ఏ దేశంలోనో.. రహస్యంగా కూర్చుని, ఇక్కడి అమాయక బతుకుల పీక నొక్కేస్తున్నారు. ఏ క్లిక్ నొక్కితే ఏమవుతుందో తెలియక వీటి మాయల్లో పడి జనం మోసపోతున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఫోన్ల మాయాజాలంలో, యాప్‌ల ఊబిలో కూరుకుపోయి సామాన్యులు విలవిలలాడుతున్న దౌర్భాగ్య కాలమిది. వీటిలో బయటకు చెప్పుకునేవి కొన్ని..చెప్పుకోలేనివి ఎన్నెన్నో!..అసలే మనవాళ్ళు సున్నిత మనస్కులు. చిన్నచిన్న కారణాలతోనే బతుకుపై విరక్తిచెంది, బలహీన మనస్తత్వంతో బలవన్మరణాలకు పాల్పడుతున్నవారికి కొదవలేని దేశమిది. అయినదానికీ కానిదానికీ అలిగి ఆత్మహత్యలు చేసుకుంటున్న వారి సంఖ్య మనదేశంలో ఒక్క 2021వ సంవత్సరంలోనే దాదాపు లక్షా 64వేలకు పైగానే ఉందని అధికారవర్గాల అంచనా. ఈ చావులు చాలవన్నట్లు, పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న మాయలాడి యాప్‌లు మరిన్ని ఆన్‌లైన్లోకి వచ్చి అప్పుల ఖాతాలతో పాటు, అమాయకజీవుల చావుల ఖాతాలు కూడా తెరుస్తున్నాయి. అప్పుల పేరుతో మన సమాచార మంతా రాబట్టి, చివరికి వేధింపులకు గురిచేసి, చచ్చేదాకా సాధిస్తున్న అనేక రకాల అక్రమ రుణ యాప్‌ల జోరు ఇప్పుడు దేశంలో విపరీతంగా పెరిగిపోతుండడం ఎంతో ఆందోళన కలిగించే అంశం. వీటిలో అనేకం చైనాకు చెందినవేనని కూడా అంటున్నారు. ఆ యాప్‌లను తెలిసికానీ, తెలియక కానీ డౌన్‌లోడ్ చేసుకుంటే ఇంతే సంగతులు. ఫోన్‌లోని నంబర్లు, మన బ్యాంకు ఖాతాల వివరాలు అన్నీ కావాలని, మీకు రుణం మంజూరవుతుందని మాయమాటలు చెప్పేస్తారు. వెంటనే రుణం దొరుకుతుంది కదా అని..మనం ఆ వివరాలన్నీ టకటకా చెప్పేయడమే పెద్ద ప్రమాదం. డబ్బులిచ్చాక, బాకీ వసూళ్ళ పేరుతో ఆ యాప్‌ల ఏజెంట్ల నుంచి వేధింపులు మొదలవుతాయి. ఇచ్చింది కొంతే అయినా..ఇంకా చెల్లించా ల్సింది ఎంతో ఉందంటారు. లేకుంటే, ఆ ఫోన్లలోని అన్ని నంబర్లకు దుష్ప్రచారం ప్రారంభం. బెదిరింపులు, బూతు కూతలు, లైంగికవేధింపులు, అసభ్యకరమైన మెసేజ్‌లు ఇస్తూ బెదిరిస్తారు. కొద్ది మొత్తంలో డబ్బులిచ్చి, పెద్దమొత్తంలో డబ్బు కట్టాలంటూ బెదిరిస్తారు, బ్లాక్‌మెయిల్ చేస్తారు. ఆ బాధలు భరించలేక 'చస్తే ఏ బాధే లేదనే' పరిస్థితికి తీసుకువస్తారు. అలా వారి వేధింపులు తట్టుకోలేక ఇప్పటికే ఎంతోమంది ఆత్మహత్యలు చేసుకున్నారు కూడా. ఇన్‌స్టెంట్ లోన్ యాప్ ద్వారా ఒక్క క్లిక్‌తోనే డబ్బులొచ్చేస్తాయని ఆశపడితే, ఆ తర్వాత నేరగాళ్ళయిన ఆ నిర్వాహకులు అంతకంత డబ్బు వసూలు చేస్తారని, ఇవ్వకుంటే ఆ ఫోన్‌లోని వాట్సాప్, ఫోటో గ్యాలరీ వగైరాలన్నిటినీ హ్యాక్ చేసి, ఫోటోలు మార్ఫింగ్ చేసి, అన్నిటినీ అశ్లీలంగా మార్చి, వాటిని ఆ ఫోన్‌లోని నంబర్లన్నిటికీ, మన స్నేహితులకు బంధువులకు అందరికీ పంపుతారని, అందువల్ల అలాంటి లోన్ యాప్‌ల వలలో చిక్కుకోవద్దని నిపుణులు సూచిస్తున్నారు. అలాంటి ఆన్‌లైన్ రుణ యాప్‌ల నేరాలు ఘోరాలు దేశంలో మిచ్చుమీరుతున్నాయి కనుక జాగ్రత్తగా ఉండాలని అధికారులు పదేపదే హెచ్చరిస్తున్నారు. పట్టణాల్లోనే కాదు, వీటి ప్రభావం గ్రామాల్లో కూడా పడుతోంది కనుక దేశంలోని ప్రజలందరూ ఈ యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలి. మోసపూరితమైన, చట్టవిరుద్ధమైన, అనైతికమైన అలాంటి యాప్‌లను నిరోధించడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇటీవలే పెద్దఎత్తున కృషిని ప్రారంభించాయి. అయితే, చైనా.. తదితర దేశాల నుంచో, ఎక్కడెక్కడి నుంచో కొన్ని డొల్ల కంపెనీల నుంచి ఈ యాప్‌లు ఆపరేట్ అవుతుండడంతో, అలాంటి దొంగయాప్‌లను అరికట్టడం ఒక పెద్దసవాల్‌గానే ఉంటుంది. ఏదేమైనా, ఇలాంటి యాప్‌లకు వినియోగదారులు దూరంగా ఉండడమే అన్నిటికన్నా శ్రేయస్కరం. యాప్‌లకు సంబంధించి, రుణాలకు సంబంధించి ఏదైనా అనుమానం వస్తే సంబంధిత అధికారుల నుంచి పూర్తి విషయాలు తెలుసుకోవాలే తప్ప, మన వ్యక్తిగత సమాచారం ఎవరికీ ఇవ్వకూడదు. మోసకారుల యాప్‌ల ఊబిలోకి జారిపోయాక బాధపడేకంటే, ముందు జాగ్రత్తే మేలు. ఈ డిజిటల్ మాయల్లో పడి మోసపోకుండా.. ఎవరి జాగ్రత్తలు వారు తీసుకోవాల్సిందే తప్ప.. మరో ప్రత్యామ్నాయమార్గం ఏమీ కనిపించడం లేదు. తస్మాత్.. జాగ్రత్త!

## ఆర్టీసీ బస్‌స్టేషన్‌తో.. ప్రజల 'బ్రతుకు బస్టాండు'గా మారింది!



ఎవరికైనా తీర్చలేని కష్టాలు వస్తే.. వాడి 'బ్రతుకు బస్టాండే' అన్న ఊతపదం మనం వాడుకలో వింటుంటాం. నెల్లూరు నగరంలోని ఆర్టీసీ బస్టాండు కారణంగా ఇటు ప్రయాణికులకు, అటు నగరంలో ప్రయాణించే వాహనదారులకు నిత్యం వారి 'బ్రతుకు బస్టాండే' అన్న పరిస్థితులు నెలకొనివున్నాయి. నెల్లూరు నగర నడిబొడ్డులో ఉన్న ఆర్టీసీ బస్టాండు కారణంగా నగరవాసులకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.




ఎప్పుడో 45సంవత్సరాల క్రితం అప్పటి అవసరాలను, పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని నగరానికి దూరంగా దర్గామిట్టలో 4 ఎకరాలలో బస్టాండును నిర్మించారు. 1977 జూన్ 7వతేదీన ఆనాటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ఈ బస్టాండును ప్రారంభించారు. అప్పటివరకూ ఆత్మకూరు బస్టాండు, మద్రాసు బస్టాండు తప్ప ఆర్టీసీ కోసం ప్రత్యేకంగా బస్‌స్టేషన్, దానికి అనుబంధంగా బస్ డిపో లేదు. తరువాతి 1991-92 ప్రాంతంలో మద్రాస్

### సమస్యల తో 'రణం'

బస్టాండును తొలగించి అక్కడ కూరగాయల మార్కెట్టును నిర్మించడంతో మద్రాసు బస్టాండు కాలగర్భంలో కలిసిపోయింది. కేవలం ప్రైవేటు బస్సులకే పరిమితమై ఉండిన ఆత్మకూరు బస్టాండును కూడా ఆర్టీసీ బస్టాండుగా మార్చడంతో అది కూడా ఆర్టీసీ పరమైపోయింది. వాడకంలో 'ఆత్మకూరు బస్టాండు' అని పిలుస్తున్నారు తప్ప, అది ఎప్పుడో ఆర్టీసీ బస్టాండుగా మారిపోయింది.

కాలక్రమేణా నగర జనాభా విపరీతంగా పెరిగింది. నగరం కూడా అనూహ్యంగా విస్తరించింది. అప్పుడు ఊరు బయట ఎక్కడో ఉండిన ఆర్టీసీ బస్టాండు ప్రాంతం ఇప్పుడు నగరం నడిబొడ్డుగా మారింది. ఆర్టీసీ బస్టాండు నుండి బస్సుల రాకపోకల సంఖ్య కూడా అంతకంతకూ పెరిగిపోతూనే ఉంది. ఫలితంగా ట్రాఫిక్ సమస్యతో నగరవాసులు అల్లాడిపోతున్నారు. మేజర్ బైపాస్, మినీ బైపాస్ రోడ్లు కొత్తగా ఏర్పడినప్పటికీ ప్రతి బస్సు తప్పనిసరిగా ఆర్టీసీ బస్‌స్టాండుకి రావలసి ఉండడంతో టౌన్ మధ్యలో నుండి రావాల్సిందే తప్ప మరో ప్రత్యామ్నాయం లేదు. వేలకొద్దీ ఆటోలు, ద్విచక్రవాహనాలు, వందలకొద్దీ కార్లు ఇతర రవాణా వాహనాలు, ఉన్న ఒకే ఒక ప్రధాన రహదారిపై ప్రయాణం చేయవలసి రావడంతో ట్రాఫిక్‌ను అదుపు చేయడంలో పోలీసుశాఖ సైతం చేతులెత్తేసింది. 2005-07 ప్రాంతంలో జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన ముద్దాడ రవిచంద్ర అప్పటి జిల్లా నేతల సహకారంతో ప్రధాన బస్టాండును నగరంలోనుండి మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. భవిష్యత్తులో కూడా ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఉండే విధంగా మినీబైపాస్ మేజర్ బైపాస్ రోడ్లకు మధ్యలో బస్టాండును నిర్మించేలా డిజైన్లను తయారు చేయించారు. అంతా సిద్ధం అనుకున్న తరుణంలో ఆయన బదిలీపై వెళ్లిపోవడంతో ఆ తరువాత వచ్చిన అధికారులు, పాలించిన ప్రభుత్వాలు ఆ ఆలోచనను అటకెక్కించాయి.

తాజా గణాంకాల ప్రకారం ప్రస్తుతం ఉన్న ఆర్టీసీ బస్‌స్టేషన్ నుండి ఇక్కడి నుండి బయలుదేరేవి గానీ, లేదా బయట ప్రాంతాలనుండి వచ్చి ఈ బస్‌స్టేషన్ మీదుగా ప్రయాణించేవి గానీ మొత్తంగా రోజుకి 819 బస్సులు వివిధ ప్రాంతాలకు వెళ్తున్నాయి. వీటి ద్వారా సుమారు 42 వేలమంది ప్రయాణికులు ఈ బస్టాండు నుండి తమ గమ్యస్థానాలకు చేరుతున్నారు. అంటే నెలకి సుమారుగా 12 లక్షల 60 వేలమంది, ఏడాదికి కోటీ 51 లక్షల 20 వేల మంది నెల్లూరు ప్రధాన ఆర్టీసీ బస్టాండు నుండి ప్రయాణం చేస్తున్నారు. ఇంత భారీ స్థాయిలో ప్రయాణీకులు రాకపోకలు సాగించే బస్టాండు 45 సంవత్సరాల క్రితం కేవలం 4 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ప్రాంగణంలోనే ఉండిపోయిందంటే మన జిల్లా నేతలకు ఇంతకంటే సిగ్గుచేటైన విషయం మరొకటి లేదని చెప్పొచ్చు. మోడల్ బస్‌స్టేషన్ల పేరుతో ప్రభుత్వం రాష్ట్రంలోని పలు నగరాలలో కొత్త బస్టాండ్ల నిర్మాణానికి పునాదులు వేస్తోంది, అందులో నెల్లూరు లేకపోవడం మన నాయకుల నిర్లక్ష్యానికి నిదర్శనం. ఇప్పటికైనా పనికిరాని మురా తగాదాలను పక్కనపెట్టి పాత కలెక్టర్ తయారుచేసిన ప్రతిపాదనలను అటకపైనుండి దించి కొత్త బస్‌స్టేషన్‌ని జిల్లా వాసులకు కానుకగా అందిస్తే, అటు ప్రయాణికులకు, ఇటు ట్రాఫిక్ అవస్థలతో సతమతమవుతున్న నగరవాసులకు మేలుచేసిన వాళ్ళుగా చరిత్రకెక్కుతారు. లేదంటే ప్రజల బాధలు పట్టని దగా నాయకులుగా చరిత్రలో మిగిలిపోతారు.

**- సంచారి**

## బూతుప్రదేశ్‌గా ఆంధ్రప్రదేశ్

ఆంధ్ర రాజకీయాలలో బూతుపురాణాలు రాను రాను శృతిమించిపోతున్నాయి. పార్టీ ఏదైనా పోకడ మాత్రం ఒకటిగానే ఉంది. రాజకీయాలలోకి వచ్చిన కొత్త నీరు తీరు జుగుప్సాకరంగా ఉంటోంది. ఒకరిని మించి ఒకరు బూతుపురాణాలు వల్లిస్తూ ఆంధ్రప్రదేశ్‌ని బూతుప్రదేశ్‌గా మార్చేశారు. సామాజిక మాధ్యమాలలో, టీవీ ఛానళ్లలో ఈ నికృష్టపు నేతలు మాట్లాడుకునే నీచాతి నీచమైన భాష వింటున్న చిన్నపిల్లలు తమ స్కూళ్లలో తోటి విద్యార్థులతో కూడా ఇదే భాషను మాట్లాడుతున్నారు. సినిమాలకు సెన్సార్ చేసి 'ఏ' సర్టిఫికెట్ ఇచ్చినట్లుగా ఈ రాజకీయాలలోకి వచ్చే వారి గతచరిత్రను పరిశీలించి ఇలాంటి బూతునేతలను అనర్హులుగా ప్రకటించే విధానం అమలుచేస్తే ఇలాంటి ఛండాలపు నేతల పీడ విరగడైపోతుంది.

**పుట్టా హరిత,** గూడూరు.




## నేరాలు పెరుగుతున్నాయి

'నేరపురిగా మారుతున్న సింహపురి' అంటూ మన 'లాయర్'లో రాసిన వార్త అక్షరాలా నిజం. శివారు ప్రాంతాలలో నివసిస్తున్నవాళ్ళు రాత్రి వేళల్లో బిక్కు బిక్కు మంటూ భయంతో బ్రతకాల్సి వస్తోంది. చాలాచోట్ల వీధిలైట్లు వెలగడంలేదు. రాత్రివేళల్లో పోలీసు పెట్రోలింగ్ ఉండడంలేదు. అప్పుడప్పుడు కరంటు పోతే ఏం జరగబోతోందో అని భయపడి చస్తున్నాం. ప్రశాంతమైన నెల్లూరు నగరంలో గత కొన్ని నెలలుగా నేరాలు ఘోరాల సంఖ్య పెరిగిపోయింది. సింహపురి వాసులను ఆ సర్వేశ్వరుడే రక్షించాలి. నేతలు దయతలచి వీధిలైట్లు వెలిగించేందుకు అధికారులను పురమాయించాలి. రాత్రివేళ గస్తీ కాసేందుకు పోలీసులను పంపితే కొంతవరకైనా ప్రజలకు భయం తగ్గుతుంది.

**ఆర్.పి. రామయ్య,** కొండాయపాలెం.

## కల్తీ ఆహారం తినలేకపోతున్నాం

నెల్లూరు నగరంలోనే కాదు, జిల్లా వ్యాప్తంగా అనేకచోట్ల ఉన్న హోటళ్ళు, రెస్టారెంట్లలో ఇటీవల కాలంలో కల్తీ ఆహారం జోరు పెరిగిపోతోంది. వాటి యజమానులు కేవలం లాభార్జన కోసం నాసిరకం నూనెలు, వంట పదార్థాలతో ఆహారప్రియులను బురిడీ కొట్టిస్తున్నారు. ధరలేమో మండిపోతుంటాయి కానీ, తినే ఆహారపదార్థాలలో నాణ్యత మాత్రం ఉండదు. కొన్ని హోటళ్ళలో మాంసాహారం పరిస్థితి మరింత ఘోరంగా ఉంది. నానా రకాల పేర్లతో పెట్టే బిర్యానీలు, సూప్‌లు వగైరాల్లో కుళ్ళిపోయిన మాంసం వినియోగిస్తున్నారనే మాటలు సర్వత్రా వినిపిస్తున్నాయి. అవసరార్థం ఎప్పుడైనా హోటల్‌కు వెళ్లి ఏదైనా తినాలనిపిస్తే... ఇలాంటి కల్తీల బారినపడి ఆరోగ్యం ఏమైపోతుందో, ఏమోనని ఆందోళన కలుగుతోంది. ఈ కల్తీలను నివారించేందుకు అధికారులు జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా తనిఖీలు చేస్తుండాలి. కల్తీ ఆహారపదార్థాలు కనిపిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి. తద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడాలని ప్రార్థన.

**ఎన్.శేషకుమార్,** నెల్లూరు.


2022 NEET RESULTS
NEET ఫలితాలలో పురోగమనం దిశగా పయనిస్తూ..
విశ్వసనీయతను చాటుకున్న విశ్వసాయి
అత్యుత్తమ ఫలితాలతో... అత్యధిక మెడికల్ సీట్లు సాధింపచేసి... విద్యార్థుల కలలను నిజం చేసింది..
డైరెక్టర్ల నిరంతర పర్యవేక్షణ, ప్రతిభ గల అధ్యాపకుల ఆధ్వర్యంలో... ఒత్తిడిని జయించేలా ప్రణాళికాయుత బోధన మరియు మంచి ఫలితాలు సాధించేలా విద్యార్థిని తీర్చిదిద్దుతుంది విశ్వసాయి
Total number of MBBS seats achieved from 2012 - 2022
900+
ALL INDIA MARK
642
P. BHAVYA SRI
H.T. No. 220410428119
628
ALL INDIA MARK
K. RUSHIKA
H.T. No. 220410844831
613 A.PADMAVATHI H.T. No. 220410674541
585 G.CHAITANYA KUMAR H.T. No. 220410547428
579 V.VENKATA ISHVARYA H.T. No. 220410762669
563 K.VAISHNAVI H.T. No. 220410578366
561 SK.KHUTEJA FATIMA H.T. No. 220410076259
560 B.SAMHITHA H.T. No. 220410309884
558 MRUDULASRI H.T. No. 220410560101
549 V.NAGA HARINI H.T. No. 220410683673
543 A.MANASA MANOGNA H.T.NO.220410043927
538 N.RIZWANA H.T. No.220410540270
538 T.DEEPIKA H.T. No.220410648810
537 V.SAI SRI H.T. No.220411062168
536 Y.KEERTHI REDDY H.T. No.220410650471
533 SK.KUBRA H.T. No.220410700152
530 R.SINDHU H.T. No.220410724284
530 P.VINEETHA H.T. No.220411199329
529 P.NYRUSH KALEV H.T.NO.220410526170
528 B.PRADHYUMNA H.T.NO.220410183210
528 CH. PALLAVI H.T.NO.220411049253
524 M.THANVI H.T.NO.220410591269
521 SAMEER SK H.T.NO.220410966569
520 C.CHARITAMBIKA H.T.NO.220410535295
519 KARTHIK VIJAY.V H.T.NO.220410784475
518 NAVYA SRI.G H.T.NO.220410423843
515 C.VYSHNAVI H.T.NO.220410252444
510 JYOTHSNA DEVI.K H.T.NO.220410681611
507 K.NAGA LAKSHMI H.T.NO.220410898204
506 ANUSREE.A H.T.NO.220411214417
506 SAAHITHI D H.T.NO.220411177854
506 SANIYA M H.T.NO.220410074615
502 PRAMODINI.P H.T.NO.220410539354
498 GANESH.BV H.T.NO.220410473613
498 KARTHIK.P H.T.NO.220410443284
496 MUSKAN.SD H.T.NO.220410545084
493 ELAWARASI.A H.T.NO.220410887807
493 SAI JHANSI.K H.T.NO.220410541127
492 KARISHMA BANU.SD H.T.NO.220410527938
492 CH.CHAKRADHAR H.T.NO.220410571142
490 MADHUVANI.T H.T.NO.220410253574
488 SAMEENA.MD H.T.NO.220410108731
ఈ ఘనవిజయాలు సాధించిన మా విద్యార్థినీ విద్యార్థులకు సహకరించిన అధ్యాపక,అధ్యాపకేతర బృందానికి హార్దిక శుభాభినందనలు...
NEW BATCH 2023 NEET LONG TERM
క్లాసులు ప్రారంభం
Dr.N.Satyanarayana & G.Krishna Mohan's
VISWASAI
NEET MEDICAL ACADEMY
NELLORE - TIRUPATI
For more details...
NELLORE:- 8886770470,9949935396.
TIRUPATI:- 9160670004,8886667012,13,14.
హాస్టల్ వసతి కలదు
అడ్మిషన్లు జరుగుచున్నవి
NELLORE
Annamaiah Circle, Magunta Layout
TIRUPATI
Bairagi Patteda, Opp. Babu Jagzeevanram Municipal Park

### మత్స్యకారుల అభ్యున్నతికి..

# కేంద్రం కృషి అపారం

### కేంద్రమంత్రి మురుగన్



సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతితోపాటు ప్రత్యేకించి మత్స్యకారుల అభివృద్ధి కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం అపారమైన కృషి చేస్తోందని కేంద్ర పశుసంవర్ధక, మత్స్య, సమాచార ప్రసార శాఖల సహాయమంత్రి ఎల్.మురుగన్ అన్నారు. ఈనెల 11న నెల్లూరులోని వీఆర్‌సి గ్రౌండ్స్‌లో మత్స్యకార సహకార సమితి ఏర్పాటు చేసిన 'ఫిష్ ఫుడ్‌ఫెస్టివల్'ను ఆయన ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ, మత్స్య ఆహారం పట్ల ప్రజల్లో మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మత్స్యపరిశ్రమ కోసం మంత్రిత్వశాఖను ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ చొరవ మరువలేనిదన్నారు. గత 8 ఏళ్ళలో మత్స్యపరిశ్రమ అభివృద్ధి కోసం 32వేల కోట్లను కేంద్రం ఖర్చు చేసిందని ఆయన తెలిపారు. కరోనా సమయంలో అన్ని రంగాలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు కేంద్రం 20 వేల కోట్లతో మత్స్యకారుల అభ్యున్నతి కోసం కేంద్రం కృషి చేసిందని పేర్కొన్నారు. ప్రత్యేకించి కోటి 20 లక్షల విలువైన డీప్ సీ వెజల్స్‌ను 60 శాతం సబ్సిడీతో అందించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా తెలుగులో రూపొందించిన 'ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన' పథకం వివరాలకు సంబంధించిన పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్, నెల్లూరు ఆర్డీఓ మాలోల, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు, మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షులు కోలంగారి పోలయ్య, నెల్లూరు జిల్లా అధ్యక్షులు సామంజి మురళి, జలనిధి ఫెడరేషన్ ఛైర్మన్ కదిరి పోలరాజు, భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి



నేర నియంత్రణకు, ముఖ్యంగా దొంగతనాల నుంచి రక్షణ పొందేందుకు సీసీ కెమెరాల ఏర్పాటు ఎంతగానో ఉపయోగపడుతుందని, ప్రతి ఒక్కరూ వీటిని ఏర్పాటుచేసుకుంటే కేసుల పరిశోధన సులభతరమవుతుందని జిల్లా ఎస్పీ సిహెచ్ విజయారావు కోరారు. ఇటీవల ఆయన నెల్లూరులోని వాణిజ్య సముదాయాల యజమానులతో, వ్యాపారవేత్తలు, ఇళ్ళ యజమానులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ, ప్రజల ఆస్తులు, ప్రాణరక్షణలో సీసీ కెమెరాల పాత్ర ఎంత కీలకంగా ఉంటుందో అవగాహన కల్పించారు. నెల్లూరు నగరంలో ఇటీవల దంపతుల హత్య, ఇతరత్రా దొంగతనాల ఆచూకీ కనుగొనడంలో సీసీ కెమెరాలు బాగా ఉపయోగపడ్డాయని తెలిపారు. జిల్లావ్యాప్తంగా వాణిజ్య సముదాయాలు, వ్యాపారసంస్థలు, శివారు ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అదనపు ఎస్పీలు హిమవతి, చౌడేశ్వరి, డిఎస్పీలు కోటారెడ్డి, అబ్దుల్ సుబాన్ తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు కబుర్లు





### 'టీబి ముక్తభారత్'లో..

# నెల్లూరు ఎంపీ ఆదాల

నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఇటీవల 'ప్రధానమంత్రి టీబి ముక్తభారత్ అభియాన్ కార్యక్రమం'లో జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబుతో కలిసి పాల్గొన్నారు. నెల్లూరు కలెక్టరేట్‌లో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము టీబీ వ్యాధి నివారణ గురించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్సుక్ మాండవియా, రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నెల్లూరు నుంచి ఆ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డితోపాటు, విజయ డెయిరీ ఛైర్మన్ రంగారెడ్డి, జడ్పీటిసి సుధాకర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ స్వర్ణ వెంకయ్య, నవీన్‌రెడ్డి, నరసింహారావు, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు ఆర్టీఓగా సుధాకర్‌రెడ్డి



నెల్లూరు ప్రాంతీయ రవాణా అధికారి (ఆర్టీ ఓ)గా వై.సుధాకర్‌రెడ్డిని నియమిస్తూ ఉన్నతాధికారులు ఇటీవల ఉత్తర్వులు జారీచేశారు. విశాఖపట్నంలో ఆర్టీఓగా పనిచేస్తున్న వై.సుధాకర్‌రెడ్డిని నెల్లూరులో నియమించారు. ఈ నెల 12న ఆయన బాధ్యతలు స్వీకరించారు. డిటిసి చందర్‌ను కలిసి ఆయన జాయినింగ్ రిపోర్టును అందజేశారు. ఎంవిఐలు మురళీమోహన్, బాలకృష్ణ, ఎఎంవిఐ పూర్ణచంద్రరావు ఆయనకు అభినందనలు తెలిపారు.

# శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి మాలధారణ ప్రారంభం

శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నెల్లూరు దర్గామిట్టలో ఉన్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఈనెల13 నుంచి 'అమ్మవారి మాలధారణ' కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ప్రారంభమైంది. దాదాపు 250 మందికి పైగా భక్తులు మాలధారణ చేసుకున్నారు. శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి సేవాసమితి అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి ఆధ్వర్యంలో, ఆలయ ప్రధాన అర్చకుడు రఘురామమూర్తి తదితరులు ఈ కార్యక్రమం నిర్వహించారు.

### కృష్ణంరాజు మృతికి..

# వేమిరెడ్డి విచారం

కేంద్ర మాజీ మంత్రి, ప్రముఖ సినీనటుడు కృష్ణంరాజు మృతి బాధాకరమని రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నటుడిగా, రాజకీయనాయకుడిగా కృష్ణంరాజు ప్రజలకు చేసిన సేవలు ఎనలేనివని ఆయన తెలిపారు. కృష్ణంరాజు ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబసభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానని ఆయన పేర్కొన్నారు.

### స్పాస్టిక్ సెంటర్‌కు..

# మరిన్ని వసతులు సమకూరుస్తాం

### రెడ్‌క్రాస్ ఛైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి



నెల్లూరు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలోని స్పాస్టిక్ సెంటర్‌కు మరిన్ని వసతులు సమకూరుస్తామని రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. ఈనెల 13న ఆయన స్థానిక ఎంఎస్ఆర్ స్పాస్టిక్ సెంటర్‌లో సిఆర్‌సి వెంకటాచలం దివ్యాంజన్ వారి సౌజన్యంతో విభిన్న ప్రతిభావంతులైన పిల్లలకు, దివ్యాంగులకు వారి ఇంటివద్ద ఉపయోగించుకునే పరికరాల కిట్లను అందజేశారు. 8వేల రూపాయల విలువజేసే పరికరాలను 34 మంది చిన్నారులకు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్పాస్టిక్ సెంటర్‌కు ప్రాధాన్యత ఇచ్చి మెరుగైన వసతులు ఏర్పాటుచేస్తామన్నారు. స్పాస్టిక్ సెంటర్‌లో దివ్యాంగులకు అందుతున్న సేవలను కన్వీనర్ ఎవి సుబ్బారెడ్డి వివరించారు. టిటిడి ప్రధాన అర్చకులు, బ్రహ్మశ్రీ కిరణ్ దీక్షతులు జన్మదినాన్ని పురస్కరించుకుని చిరంజీవి ఐ బ్యాంక్ అధ్యక్షులు సుధీర్ ఈ సందర్భంగా స్పాస్టిక్ సెంటర్‌లో అన్నవితరణ గావించారు. విన్నకోట శివ, బాలశెట్టి కిషోర్, మురళీరాజు, బాలచెన్నయ్య, చక్రధర్, రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు రాజేంద్రప్రసాద్, కన్వీనర్ వెంకట్రెడ్డి, సెక్రటరీ మస్తానయ్య, ప్రిన్సిపాల్ గురునాథరావు, కోఆర్డినేటర్ జివి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మద్దతు ధర ఇచ్చి.. సజ్జలు కొంటాం

### మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్

జిల్లాలో రైతులు పండించిన సజ్జల పంటను ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయడానికి నిర్ణయించిందని, క్వింటాలు సజ్జల ధర 2350 రూపాయల వంతున మద్దతు ధర ఇస్తుందని జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ పవన్‌కుమార్ చెప్పారు ఈనెల 13న ఆయన నెల్లూరులోని తమ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ, జిల్లాలోని సీతారామపురం, మర్రిపాడు, కలువాయి, కొండాపురం, అనంతసాగరం, కందుకూరు, లింగసముద్రం మండలాల్లో రైతుభరోసా కేంద్రాల ద్వారా సజ్జల కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# కండలేరు నిర్వాసితులకు.. ఉద్యోగాలివ్వాలి



కండలేరు నిర్వాసితుల్లోని నిరుద్యోగులు ఏళ్ల తరబడిగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని, వారి కుటుంబాల దుస్థితిని గమనించి అధికారులు ఇకనైనా వారికి ఉద్యోగాలిచ్చేందుకు కృషిచేయాలని బిజెపి నాయకుడు, 'నమామి గంగే' ప్రతినిధి మిడతల రమేష్ కోరారు. ఈనెల 12న నిర్వాసిత నిరుద్యోగులకు మద్దతుగా కలెక్టరేట్‌కు వెళ్ళి జేసీ కూర్మనాథ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. జిఓ నంబరు 45, 98 ప్రకారం కండలేరు నిరుద్యోగులకు ఉద్యోగాలివ్వాలని ప్రతిపాదించే ఫైల్‌ను వెంటనే రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాలని ఆయన జేసీని కోరారు.






# కాటాల మోసాలు.. రైతులకు నష్టాలు

### అరికట్టాలంటూ రైతుసంఘం నాయకుని వినతి

రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే సందర్భంలో గ్రామాలకు తెచ్చి వినియోగిస్తున్న కాటాలు మోసపూరితంగా ఉంటున్నాయని, వీటితో రైతులకు కనీసం 2 నుంచి 3 కేజీల దాకా అదనంగా నష్టపోతున్నారని, ఆ కాటాలకు ఎప్పుడు సీళ్ళు వేశారో తెలియడం లేదని, జిల్లా వ్యాప్తంగా తూనికలు కొలతల శాఖల అధికారులు దాడులు చేస్తే ఈ మోసాలన్నీ బయటపడతాయని రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చిరసాని కోటిరెడ్డి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఇటీవల ఆయన జేసీ కూర్మనాథ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. జిల్లాలో రెండోపంట వరికోతలు కూడా ప్రారంభమైనా, మొదటిపంట కాలంలో ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి రైతులకు చెల్లించాల్సిన బకాయిలను ఇప్పటికీ ఇవ్వనే లేదని, ధాన్యం తోలిన రవాణా చార్జీలు కూడా చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ఎగుమతి కూలీగా టన్నుకు 250 రూపాయల వంతున చెల్లించాల్సి ఉందని, జిల్లాలో వీటిని ఏ ఒక్కరైతుకీ ఇప్పటిదాకా చెల్లించకపోవడం దారుణమని, పంట రుణాల విషయంలో కూడా రైతులకు అన్యాయమే జరుగుతోందని, బ్యాంకుల నుంచి లక్ష రూపాయలు తీసుకుని సకాలంలో చెల్లించిన రైతులకు గత రెండు సంవత్సరాల నుంచి వడ్డీ తిరిగి చెల్లించడం లేదని, రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తిచేశారు.



# ప్రయోజనకరం.. సేంద్రీయ సేద్యం

## - రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్‌రావు

దేశంలో సేంద్రీయ వ్యవసాయానికి మంచిరోజులు వస్తున్నాయని, రైతుల్లో ఈ సేద్యం పట్ల అవగాహన పెరుగుతోందని, దేశ విదేశాల్లో కూడా సేంద్రీయ ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉంటోందని రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్‌రావు (బిఎంఆర్) చెప్పారు. గో అధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం, జిల్లాలోని సింహపురి సేంద్రీయ వ్యవసాయదారుల సంఘం, మత్స్యకార సంక్షేమసమితి సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల నెల్లూరులోని విఆర్‌కాలేజీ మైదానంలో ఏర్పాటుచేసిన సేంద్రీయ మేళా–2022, ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా బిఎంఆర్ మాట్లాడుతూ రైతులు సేంద్రీయ ఉత్పత్తులకు వస్తున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని సేంద్రీయ వ్యవసాయాన్ని ముమ్మరం చేయాలన్నారు. దేశంలో సుమారు 28 లక్షల హెక్టార్లలో సేంద్రీయ వ్యవసాయం జరుగుతోందని, నూనెగింజలు, కాఫీ, టీ, సుగంధద్రవ్యాలు, మినుములు, తృణధాన్యాలు, వరి సేద్యంతో పాటు, ఇతరత్రా పండ్లతోటలు కూడా సేంద్రీయ వ్యవసాయం ద్వారా జరుగుతున్నాయన్నారు. ఈ రకం ఉత్పత్తులు ఆరోగ్యానికి ఎంతో మంచివన్నారు. రసాయనిక ఎరువులు వాడకుండా చేసే ఈ వ్యవసాయంలో ఖర్చు తక్కువగా, రైతులకు లాభసాటిగా ఉంటుందన్నారు. మంచి పోషకవిలువలతో, రుచికరమైన ఉత్పత్తులను పెంపొందించేందుకు సేంద్రీయ వ్యవసాయం ఎంతో అనుకూలమన్నారు. సేంద్రీయ ఉత్పత్తులను కొనుగోలు చేస్తూ అందరూ ఆ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని ఆయన సూచించారు. మత్స్యకార సంక్షేమసమితి రాష్ట్ర సలహాదారుడు విజయాదిత్య, భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జి.రాంబాబు, అధ్యక్షులు బి.రాఘవులు, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.రామకృష్ణంరాజు, పద్మశ్రీ అవార్డు గ్రహీత–రైతునేస్తం ఫౌండేషన్ అధ్యక్షుడు వై.వెంకటేశ్వరరావు, ఆప్కాఫ్ ఛైర్మెన్ కొండూరు అనిల్‌బాబు, రైతు సంఘం నాయకులు చిరసాని కోటిరెడ్డి, వ్యవసాయ శాఖ జేడీ సుధాకర్‌రాజు, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# యువతకు ఉద్యోగాలు లేవు.. ఉపాధీ లేదు

## వైకాపా పాలనలో ఇదీ తీరు

### - టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి




'వైకాపా ప్రభుత్వం వచ్చాక ఈ మూడున్నరేళ్ళ పాలనలో రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ తెచ్చింది లేదు, ఒక్క రూపాయి పెట్టుబడి పెట్టింది లేదు. యువతకు ఉద్యోగాలు లేవు.. ఉపాధి అవకాశాలూ లేవు. ప్రతి ఏడాది జాబ్ కేలండర్ ద్వారా నిరుద్యోగ యువతకు లక్షలాది ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం కేవలం 10,143 ఉద్యోగాలను మాత్రం ప్రకటించి చేతులు దులుపుకొంది. ఇదీ వైకాపా తీరు'..అంటూ మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరోసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దుయ్యబట్టారు. తెలుగు యువత నెల్లూరు జిల్లా అధ్యక్షులు కాకర్ల తిరుమలనాయుడు ఆధ్వర్యంలో ఇటీవల నెల్లూరులోని జిల్లా టిడిపి కార్యాలయంలో 'నిరుద్యోగ రణం–జాబ్ ఎక్కడ జగన్?' అనే నినాదాలతో జరిగిన పోస్టర్ల ఆవిష్కరణలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ, వైకాపా పాలనలో యువత భవిత ప్రశ్నార్థకంగా మారిందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో 5లక్షల మంది నిరుపేద నిరుద్యోగులకు ప్రతి నెలా 2వేల రూపాయల వంతున నిరుద్యోగ భృతిని అందిస్తే, వైకాపా అధికారంలోకి వచ్చిన వెంటనే దానిని కక్షపూరితంగా నిలిపేశారని ఆయన ధ్వజమెత్తారు. టిడిపి నేతలను తిట్టినోళ్లకే మంత్రి పదవులు ఇస్తానన్న జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుతో, మంత్రి పదవి ఆశతో మాజీమంత్రులు, ఎమ్మెల్యేలు బూతు పురాణం ఎత్తుకుంటున్నారని, వైసీపీ నేతల బూతు గోల భరించలేక రాష్ట్ర ప్రజలు చెవులు మూసుకుంటున్నారని ఆయన విమర్శించారు. టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, నగర టిడిపి నాయకుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్, తెలుగు యువత ఉపాధ్యక్షుడు చిట్టిబోయిన దత్తాత్రేయ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసిటీలో..ఒంగోలు ఎంపీ మాగుంట శీనయ్య

ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి సోమవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికి, శ్రీసిటీలో ఉన్న ప్రపంచ శ్రేణి మౌళిక సదుపాయాలను, పారిశ్రామిక ప్రగతిని వివరించారు. పారిశ్రామిక అభివృద్ధి కోసం దేశ విదేశాలకు చెందిన ఎన్నో పరిశ్రమలకు నెలవుగా శ్రీసిటీని అభివృద్ధి చేస్తున్న శ్రీసిటీ ఎం.డి డా. రవీంద్ర సన్నారెడ్డిని ఎంపీ మాగుంట అభినందించారు. శ్రీసిటీ సందర్శనకు వచ్చినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ ఎంపీకి డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ధన్యవాదాలు తెలిపారు.




# 'గడప గడప'లో మంచి ఆదరణ

## - కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న



మండల కేంద్రమైన అల్లూరు రోడ్డు అభివృద్ధికి 8.75 కోట్ల రూపాయలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చెప్పారు. ఈనెల 13న ఆయన కొడవలూరు మండలంలోని పద్మనాభసత్రం, బసవాయపాళెం గ్రామాల్లో 'గడపగడపకు ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పర్యటనలో అన్నిచోట్ల మంచి ఆదరణ లభిస్తోందన్నారు. జాతీయ రహదారి నుంచి చాయప్పనగర్, తలమంచి, వడ్డిపాళెం, కూనంపాడు మీదగా అల్లూరు రోడ్డు దాకా పిఎంజిఎస్‌వై కింద నిధుల కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. అదేవిధంగా విడవలూరు మండలంలోని పార్లపల్లి నుంచి చవటపాళెం వరకు రోడ్డు పూర్తిగా దెబ్బతినిపోయిందని, దాని బాగుకు 1.30కోట్లను వ్యవసాయమార్కెట్ కమిటీ విడుదల చేసిందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేసే కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు.

## జిల్లాలో కొత్తగా..

# 455 వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లు

జిల్లాలో త్వరలో 455 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటుచేయనున్నామని, వచ్చే సంక్రాంతికల్లా వాటిని ప్రారంభించేందుకు కృషిచేస్తున్నామని డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య తెలిపారు. ఈనెల 13న ముత్తుకూరు పిహెచ్‌సిలో ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల పరిధిలో ఏర్పాటుచేసిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు కూడా సంక్రాంతి నుంచి ప్రారంభించేందుకు ప్రభుత్వం సంకల్పించిందన్నారు. వీటికి ప్రత్యేక భవన నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. అవసరమైన చోట అద్దె భవనాల్లో కూడా వీటిని నిర్వహించడం జరుగుతుందన్నారు. తొలుత ఆయన ముత్తుకూరు పిహెచ్‌సిని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు.

# 'తంగిరాల మహాభారతం' 21వ భాగం




భీష్ముడు, సత్యవతి దేవికి దీర్ఘతముని కథ చెపుతాడు. పూర్వకాలంలో ఉతద్యుడు అనే గొప్ప మునీశ్వరుని భార్య మమత, సోదరుడు, దేవగురువు అయిన బృహస్పతి. మమత గర్భవతిగా ఉన్న సమయంలో దేవర న్యాయం ప్రకారం, బృహస్పతి ఆమెను మోహించి, ఆమెతో ఏకాంతంగా కామించాలని ఆమెను బలవంతం చేస్తున్నాడు. మమత దానికి అంగీకరించక, తన గర్భంలో ఒక పిల్లవాడు పెరుగుతున్నాడని, వేదం, వేదాలు అప్పుడే అభ్యసించాడని వారిస్తుంది. అయినా బృహస్పతి తన కోరిక తీర్చుకోవాలని, ఆమెతో బలవంతంగా కామిస్తున్నాడు.

మమత గర్భంలో ఉన్న పిల్లవాడు కోపించి, బృహస్పతితో, పెద తండ్రి, నీకిది న్యాయం కాదు, నేను ఇక్కడ పెరుగుతున్నాను, నీవు మహావీర్యుడవు, కావున, ఇంకో శిశువుకు చోటు లేదు. అందువల్ల, ఈ అధర్మ కార్యం ఆపివెయ్యమని చెపుతాడు. బృహస్పతి అతని మీద కోపంతో మండిపడి, సమస్త ప్రాణులకి సుఖం కలిగించే పని ఇది, నేను ఆనంద సమయంలో ఉన్నప్పుడు అడ్డు వస్తున్నావు, కావున, గుడ్డివాడవై పుట్టుగాక అని శపిస్తాడు. కొన్నాళ్టికి మమత ఒక గుడ్డివానికి జన్మనిస్తుంది, అతని పేరు దీర్ఘతముడు. పుట్టు గుడ్డివాడైనా వేద పండితుడయ్యి, పెద్దయ్యాక ప్రద్వేషిణి అనే ఆమెను పెళ్ళాడి, కొంతమంది కుమారులను కంటాడు.

కొంత కాలానికి ప్రద్వేషిణికి ఆయనపై విరక్తి ఏర్పడి, కుమారులతో కలిసి ఆయన్ని కట్టేసి గంగానదిలో పారవేస్తుంది. అతను ఆలా నదిలో కొట్టుకుపోతున్నప్పుడు, బలి మహారాజు చూసి, రక్షించి తన రాజధానికి తీసుకువచ్చి తనకు పుత్రదానం చెయ్యమని అడుగుతాడు. కానీ ఆ మహారాజు భార్యకి ఇష్టం లేక, తన దాసిని పంపిస్తుంది. ఆమెకు చాలామంది కుమారులను ప్రసాదిస్తాడు. అది తెలిసి, మళ్ళీ రాజు కోరినప్పుడు, ఆతని భార్య అంగాంగాలు పట్టుకుని, ఆమెకు పుత్రుణ్ణి ప్రసాదిస్తాడు. అతని పేరు, అంగుడు.

ఇలా భీష్ముడు చెప్పినప్పుడు, సత్యవతి తన కుమారుడైన కృష్ణ ద్వైపాయనుణ్ణి గుర్తుకు తెచ్చుకుని, అతని జన్మ రహస్యం భీష్మునికి చెపుతుంది. అప్పుడు మనసులో కృష్ణ ద్వైపాయనుణ్ణి తలచుకోగానే అతను ప్రత్యక్షమయ్యాడు. సత్యవతి అతణ్ణి, దేవర న్యాయం ద్వారా, అంబిక, అంబాలికలకు పుత్ర సంతానం కలగచెయ్యమని కోరింది.

**భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది.**

**పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.**




# టిసిఎస్ ఫలితాల్లో.. ఎన్‌బికెఆర్ ఫస్ట్



ప్రాంగణ ఎంపికల్లో 2022-23 విద్యా సంవత్స రానికి ఇటీవల నిర్వహించిన టిసిఎస్ ఆన్‌లైన్ పరీక్షల్లో కోట మండలం విద్యానగర్ లోని ఎన్‌బికెఆర్ ఇంజనీ రింగ్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు ప్రథమస్థానం సాధించారు. ఆ కళాశాల నుంచి మొత్తం 516 మంది విద్యార్థులు ఆ పరీక్షల్లో పాల్గొంటే, 250 మంది ఇంటర్వ్యూలకు అర్హత సాధించడం విశేషం. ఇందులో 130మంది విద్యార్థులు 7లక్షల రూపాయల వార్షిక వేతనానికి, మరో 120 మంది విద్యార్థులు 3.36 లక్షల రూపాయల వార్షిక వేతనానికి అర్హత సాధించారు కూడా. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులందరినీ కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి అభినందించారు. తమ కళాశాలలో ఉన్న వసతులు, ఫ్యాకల్టీ, ల్యాబ్‌లు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని, అందువల్ల పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించగలుగుతున్నారని ఆయన చెప్పారు. నెల్లూరు, తిరుపతి, ప్రకాశం జిల్లాల్లో ఇటీవల జరిగిన పరీక్షల్లో ఇంతమంది తమ కళాశాల విద్యార్థులు ఉత్తమంగా రాణించడం పట్ల ఆయన తన సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులకు అవసరమైన అన్నిరకాల వసతులను ఏర్పాటుచేస్తున్న కళాశాల కరెస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల ప్రాంగణ ఎంపికల అధికారి డాక్టర్ ఎన్.కిషోర్ మాట్లాడుతూ గత విద్యాసంవత్సరంలో కూడా తమ కళాశాల విద్యార్థులు ఉత్తమంగా రాణించారని, మొత్తం 757 మంది ఉన్నతమైన ఉద్యోగాలు పొందారని పేర్కొన్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

### గూడూరు రైల్వేగేటు వద్ద

# వర్షం వస్తే... అవస్థే



గూడూరు రెండోపట్టణ పరిధిలోని తిరుపతికి వెళ్ళే రైల్వేగేటు వద్ద వర్షం వస్తే నీరు నిల్వచేరి వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలామంది అక్కడ వాహనాలు అదుపుతప్పి కింద పడిపోవడం జరుగుతోంది. ఈ ప్రాంతంలో విద్యాసంస్థలు, అనేక పరిశ్రమలు కూడా ఉన్నాయి. ఎంతోమంది విద్యార్థులు, కార్మికులు అటు వెళుతుంటారు. అదేకాకుండా ఒకటవ పట్టణం నుండి రెండో పట్టణంలోకి పట్టణ ప్రజలు వెళ్లాలంటే అదే గేటుగుండా పోవాలి. వర్షపు నీరు రోడ్డుపైనే చేరడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆ మార్గంలో ప్రయాణించాలంటే ప్రజలు అవస్థలు పడాల్సివస్తోంది. ఈ సమస్యను గుర్తించి, అక్కడ డ్రైనేజీ కాలువలను త్వరితగతిన ఏర్పాటు చేయాలని రైల్వే అధికారులను పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# విద్యుత్ వినియోగదారులు సహకరించాలి

**- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇస్మాయిల్**



గూడూరు డివిజన్ పరిధి లోని విద్యుత్ విని యోగదారులు, వారి వారి విద్యుత్ శాఖల పరిధి లోని అధికారులకు సంబంధిత పత్రాలను అందజేయాలని గూడూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇస్మాయిల్ తెలియజేశారు. గూడూరు, చిల్లకూరు, కోట, చిట్టమూరు, వాకాడు, విద్యానగర్, మనుబోలు, సైదాపురం, రాపూరు మండలాల్లోని వ్యవసాయ విద్యుత్ వినియోగదారులందరూ వ్యవసాయ వినియోగానికి సంబంధించిన బ్యాంక్ అకౌంట్ వివరాలు, మాండటరీ ఫారాలు అందజేసి సహకరించాలని తెలియజేశారు. లేకుంటే ప్రభుత్వం నుండి వచ్చే సబ్సిడీ అమౌంట్ రాదని, అందువల్ల వినియోగదారులు ఆ వివరాలు పంపాలని ఆయన కోరారు.


## 22వ వర్ధంతి



**కీ॥శే॥ శ్రీ జక్కా రంగారెడ్డి**

(మరణం - 18.09.2000)

మహనీయుని దివ్యస్మృతికి మా భాష్పాంజలి

భార్య : జక్కా కామేశ్వరమ్మ

కుమారులు

జక్కా కోదండరామిరెడ్డి

జక్కా శ్రీనివాసులురెడ్డి

జక్కా శివనారాయణరెడ్డి

మరియు కుటుంబసభ్యులు


# టవర్‌క్లాక్ వద్ద 'అన్న' క్యాంటీన్



తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ ఆదేశాల మేరకు గూడూరు పట్టణం, టవర్‌క్లాక్ సెంటర్ వద్ద పట్టణ అధ్యక్షులు పులిమి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఇటీవల 'అన్న క్యాంటిన్' ఏర్పాటు చేశారు. మాజీ శాసనసభ్యులు డా॥ పాశం సునీల్‌కుమార్ పాల్గొని పేదలకు అన్నం పెట్టారు.

# నెల్‌క్యాస్ట్‌లో ఉచిత వైద్య శిబిరం



గూడూరు నెల్‌క్యాస్ట్ ఆవరణంలో నెల్‌క్యాస్ట్ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు రోటరీక్లబ్ గూడూరు వెస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు కిమ్స్ డాక్టర్ల హెచ్.నాగరాజరావు(కార్డియాలజీ), బి.మంజీర (చర్మవ్యాధులు), జె.వర్ష(జనరల్ ఫిజీషియన్), ఎస్.శ్రీనివాసులు(దంత వైద్యనిపుణులు), బి.సత్య(కంటి వైద్యనిపుణులు), ఎన్.నవీన్ జయ కుమార్ (మార్కెటింగ్ మేనేజర్) వచ్చి నెల్‌క్యాస్ట్ కార్మికులు 275 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారికి నెల్‌క్యాస్ట్ యాజమాన్యం సహకారంతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నెల్‌క్యాస్ట్ వైస్‌ప్రెసిడెంట్ ఎన్.ఎస్.రెడ్డి, సీనియర్ రొటేరియన్స్ ఎల్లసిరి గోపాలరెడ్డి, (శ్రీకంటి రామ్మోహనరావు, రోటరీ గూడూరు వెస్ట్ క్లబ్ అధ్యక్షులు ధనంజయరెడ్డి, కార్యదర్శి విజయ్ భాస్కరరెడ్డి, నెల్‌క్యాస్ట్ ప్రతినిధులు వెంకటేశన్, దువ్వూరు రవీంద్ర నాథ్‌రెడ్డి, టి.మురళీకృష్ణ, నెల్‌క్యాస్ట్ కంపెనీ పీఆర్‌ఓ అనిమెళ్ళ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వీరభద్రస్వామి దేవాలయంలో అన్నదానం

గూడూరు పట్టణంలోని త్యాగరాజవీధిలో కొలువైన శ్రీ కల్యాణ వీరభద్రస్వామి దేవాలయంలో మంగళవారం మునిమోహన్ అధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఉభయదాతలుగా దీనిపర్తి సుబ్బారావు, సుగుణావతమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు వెంకట సుబ్రమణ్యం, ఉదయ్‌కుమార్ కుటుంబసభ్యులు వ్యవహరించారు.

# ఆకట్టుకున్న.. 'కల్యాణ ప్రవచనాలు'



ప్రముఖ కవి పండితులు సూరం చంద్రశేఖరం దంపతులను సన్మానిస్తున్న నిర్వాహకులు

పద్య సారస్వత పరిషత్–నెల్లూరు శాఖ ఆధ్వర్యంలో నగరంలోని బాలాజీనగర్‌లో ఉన్న శ్రీ సీతారామస్వామి మందిరంలో ఇటీవల జరిగిన 'కల్యాణ ప్రవచనాలు' అందరినీ బాగా ఆకట్టుకున్నాయి. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని ఈ ప్రవచనాలను ఎంతో ఆసక్తిగా విన్నారు. అవధాని కోట రాజశేఖర్ రామాయణంలోని 'శ్రీ సీతారాముల కల్యాణం' గురించి సరళశైలిలో ఉపన్యసించగా, విద్వాన్ అగస్త్యరాజు సుబ్బారావు దేవీభాగవతం లోని 'ఏకావళీ ఏకవీర కల్యాణాన్ని' కళ్ళకు కట్టినట్లు వివరించారు. డాక్టర్ శ్రీనివాస చక్రపాణి 'గోదాదేవి కల్యాణాన్ని', డా.సింగరాజు రామకృష్ణ ప్రసాదరావు 'కౌసల్యా పరిణయాన్ని' వివరిస్తూ ఆంధ్రవాల్మీకి వావిలకొలను సుబ్బారావు రచించిన పలు పద్యాలను హృద్యంగా ఆలపించారు. ప్రముఖ కవిపండితులు పోలవరపు లక్ష్మీనరసింహం 'రుక్మిణీ కల్యాణం' ఘట్టాలను వివరించారు. సూరం చంద్రశేఖరం 'గిరిజా కల్యాణాన్ని' నాటకీయ ధోరణిలో వివరించారు. డా. చీమకుర్తి వేంకటేశ్వరరావు 'శ్రీనివాస కల్యాణాన్ని' చక్కగా చెప్పారు. శతావధాని డా.సూరం శ్రీనివాసులు 'నల–దమయంతుల కల్యాణం'.. అందులోని విశిష్టతను, విశేషాంశాలను జనరంజకంగా సుబోధకం చేశారు. అనంతరం ఉపన్యాసకులను నిర్వాహకులు సత్కరించారు. సత్యానందాశ్రమ పీఠాధిపతులు శ్రీ శ్రీహరితీర్థస్వామి ఆశీస్సులతో, శ్రీ సీతారామ మందిరం నిర్వాహకులు వేంకటేశ్వరగుప్తా పర్యవేక్షణలో జరిగిన ఈ ప్రవచన కార్యక్రమాలకు నలుబోలు బలరామయ్యనాయుడు, ఎం.వెంకటరెడ్డి, రమాదేవి గోవిందాచార్యులు, భారతీదేవి రామారావు, చక్కిరాల జయప్రసాద్, మాధవి సుబ్బు శ్రీనివాస్, అన్నవరం సత్యనారాయణ, ఐ.నాగరాజారావు సభాపోషకులుగా వ్యవహరించారు. స్థానిక ప్రముఖులు జి.వేంకటేశ్, యలమందయ్య, ఉచ్చి భువనేశ్వరిప్రసాద్, తిరుపతిస్వామి తదితరులు ఈ కార్యక్రమాల నిర్వహణకు తమవంతు సహకారం అందించారు.



## గిరిజనుల కాలనీల్లో
# ఆలయాల అభివృద్ధికే.. 'శ్రీవాణి ట్రస్ట్'
### మంత్రి కాకాణి

గిరిజన కాలనీల్లో దేవాలయాలను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టిటిడి ఆధ్వర్యంలో 'శ్రీవాణి ట్రస్ట్'ను ఏర్పాటు చేశారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన తోటపల్లిగూడూరు మండలం మల్లికార్జునపురం గ్రామ పంచాయతీ మందబయలు ఎస్టీ కాలనీలో టిటిడి శ్రీవాణి ట్రస్ట్ ఆర్థిక సహాయంతో, సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ, ఆర్థికస్తోమత లేని గిరిజన కాలనీల్లో కొత్తగా దేవాలయాలను నిర్మించడం, శిథిలమైన ఆలయాలను పునరుద్ధరించి పూర్వవైభవం తీసుకురావడమనే లక్ష్యాలతో రాష్ట్ర వ్యాప్తంగా టిటిడి ఆధ్వర్యంలో ఆలయాల అభివృద్ధికి ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. జిల్లాలో మొత్తం 170 ఆలయాలకు ధూప దీప నైవేద్యానికి ఇస్తున్న మొత్తాన్ని 5వేల నుంచి రూ.10 వేల రూపాయల దాకా పెంచి ప్రతి నెలా ఇవ్వనున్నట్లు చెప్పారు. సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కోట సునీల్‌కుమార్ స్వామి, కొత్తూరు లలితా ఆశ్రమం పీఠాధిపతి శ్రీ రామాయణం మహేష్‌స్వామి, ఎంపీడీఓ హేమలత, తహశీల్దార్ శ్యామలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## తాళం వేసివున్న ఇంటిని చూశారు..
# ఉన్నదంతా ఊడ్చుకుపోయారు

- నెల్లూరు పాగతోటలో ఓ డాక్టర్ ఇంట్లో భారీ చోరీ
- 60 లక్షల సొత్తు దొంగలపాలు



పోలీసుల పరిశీలన



పగులగొట్టిన తలుపు

***ఏ ఇంటికి తాళం వేస్తారా?.. అని దొంగలు కాచుకుని ఉన్నట్లుంది. తాళం వేసి, బయటకు వెళ్ళొచ్చేసరికే దోచేస్తున్నారు. నెల్లూరు నగరంలోనూ, జిల్లాలోనూ ఈ తరహా దొంగతనాలు ఇటీవల పెచ్చుమీరిపోతూనే ఉన్నాయి, కానీ పోలీసులకు ఆ దుండగులెవరన్నది అంతుచిక్కడం లేదు. జిల్లాలో ఎక్కడో ఓచోట తరచూ ఈ చోరీలు నిరాఘాటంగా జరిగిపోతూనే ఉన్నాయి. తాజాగా ఈనెల 11న 'డాక్టర్ల విల్లా'గా ప్రసిద్ధి చెందిన నెల్లూరు పొగతోటలోని ఓ ప్రముఖ డాక్టర్ ఇంట్లో భారీ చోరీ జరిగింది. ఆ డాక్టర్ ఇంటికి తాళం వేసి ఉండడం కనిపెట్టిన దొంగలు దర్జాగా తలుపులు, బీరువాలు అన్నీ పగలగొట్టి ఉన్నదంతా ఊడ్చుకుపోయారు.***

ఎక్కడో మారుమూల ప్రాంతం కాదు, నెల్లూరు నగరం నడిబొడ్డులోనే దొంగలు తమ ప్రతాపం చూపించారు. ఎప్పుడూ జనసమ్మర్దంతో ఉండే పొగతోటలో కూడా భారీ చోరీయే జరిగింది. ఇక్కడ నివాసం ఉన్న ప్రముఖ ఊపిరితిత్తుల వ్యాధుల నిపుణుడు డాక్టర్ ఏ.వి సుధాకర్ ఇంటికి తాళం వేసి ఉండడం చూసి, నిర్భయంగా దొంగలు ఆ ఇంటి తాళం పగులగొట్టి లోపలున్న నగలు, నగదు అన్నీ మూటగట్టుకుపోయారు. సుమారు 124 సవర్ల బంగారు నగలు, 10 లక్షల రూపాయలతో పాటు, కొన్ని వెండివస్తువులను కూడా దొంగలు అపహరించుకుపోయారు. ఆ డాక్టర్ హైదరాబాద్‌కు వెళుతున్నట్లు తెలుసుకుని మరీ దొంగలు ఈ దొంగతనానికి పాల్పడినట్లుంది. ఇంటి కిందిభాగంలో ఆసుపత్రి నిర్వహిస్తూ, మిద్దెపై డాక్టర్ నివాసం ఉంటున్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతమది. అయినా, దొంగలు జాగ్రత్తగా అన్నీ గమనించి పథకం ప్రకారం చోరీ చేసినట్లు తెలుస్తోంది. దొంగలు తెలివిగా, డాక్టర్ ఇంటి పక్కనే ఉన్న ఇంట్లోని చెట్టెక్కి, ఆ చెట్టు కొమ్మలు పట్టుకుని డాక్టర్ ఇంట్లోకి ప్రవేశించి, కింద మెట్ల దగ్గరున్న తాళాలు పగులగొట్టి, మేడపై అంతస్తులో ఉన్న గదుల్లోకి వెళ్ళేందుకు ప్రధాన ద్వారం తాళం కూడా పగులగొట్టి ఈ చోరీకి పాల్పడినట్లు భావిస్తున్నారు. ఇంటి తలుపును కూడా దాదాపు సగం దాకా పగులగొట్టి లోపలికి వెళ్ళారు. ఇల్లంతా చింతరవందర చేసి అందినకాడికి మూటగట్టుకుని పోయారు. ఇంటి తాళం పగులగొట్టి ఉండడాన్ని తెల్లవారాక వాచ్‌మెన్ గమనించి డాక్టర్‌కు ఫోన్‌లో ఆ విషయం తెలియజేయడం, వెంటనే ఆ డాక్టర్ చిన్నబజార్ పోలీసులకు ఆ సంగతి చెప్పడంతో పోలీసులు వచ్చి, చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. జిల్లా ఎస్పీ విజయారావు సూచనలతో నగర ఇన్‌చార్జి డిఎస్పీ ఎం.డి అబ్దుల్ సుబహాన్, సిసిఎస్ డిఎస్పీ శివాజీరాజా, చిన్నబజార్ ఇన్స్‌పెక్టర్ సురేంద్రబాబు తదతర పోలీసు సిబ్బంది క్లూస్‌టీంతో కలసి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. దొంగలు వేలిముద్రలు దొరక్కుండా గ్లౌజ్‌లు వేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. డాక్టర్ ఇంట్లో సీసీ కెమెరాలు లేకపోవడంతో, సమీపంలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీల్లోనైనా దొంగల ఆచూకీ తెలుస్తుందేమోనని పోలీసులు పరిశీలిస్తున్నారు.

## కావలిలో రెండు షాపుల్ని కొల్లగొట్టారు

కావలిలో కూడా దొంగలు అదేరోజు వేకువన (11వ తేది) రెండు దుకాణాలకు వేసి ఉన్న షట్టర్ల తాళాలను పగులగొట్టి గల్లాపెట్టెలో ఉన్న డబ్బును దోచుకున్నారు. సిహెచ్ శంకర్‌బాబు, సుమన్‌లకు చెందిన షాపుల్లో ఈ చోరీలు జరిగాయి. ఒక షాపులో వెయ్యిరూపాయలు, మరోషాపులో 5వేలు అపహరించుకునిపోయారు. డబ్బుల కోసం షాపుల షట్టర్ల తాళాలు పగులగొట్టి దొంగలు చోరీలకు పాల్పడుతుండడంతో జిల్లా వ్యాప్తంగా దుకాణాల వారు భయాందోళనలు చెందుతున్నారు. తాళాలు పగలగొట్టడంలో ఆరితేరిన దొంగలెవరో ఈ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు భావిస్తున్నారు. కావలి పోలీసులు ఆ దొంగల్ని పట్టుకునేందుకు రంగంలోకి దిగారు.

## టూకీగా...

### ప్రభుత్వోద్యోగుల సంఘం మహాసభలు..18న

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వోద్యోగుల సంఘం (ఏపిజిఇఓఏ) జిల్లా ప్రథమ కౌన్సిల్ మహాసభలు సెప్టెంబరు 18న నెల్లూరు పురమందిరంలో నిర్వహించనున్నామని, ప్రతినిధులందరూ ఈ సభలకు తప్పక హాజరు కావాలని ఆ సంఘం నాయకుడు చొప్పా రవీంద్రబాబు, జిల్లా అధ్యక్షుడు వై.రమణారెడ్డి, కోశాధికారి రామ్‌ప్రసాద్ తదితరులు కోరారు. ఇటీవల నెల్లూరులోని ఆ సంఘం కార్యాలయంలో వారు ఆ మేరకు పోస్టర్లు కూడా ఆవిష్కరించారు.

### కసుమూరు దర్గాను సందర్శించిన నెల్లూరు ఆర్డీఓ

నెల్లూరు ఆర్డీఓ మలోలా ఈనెల 11న వెంకటాచలం మండలంలోని కసుమూరు మస్తానయ్య దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా దర్గా నిర్వాహకులు ఆయనను సాదరంగా ఆహ్వానించి దైవ దర్శనం చేయించారు.

### అంబేద్కర్ సేవాసమితి ఆధ్వర్యంలో.. ఉచిత వైద్యశిబిరం

నెల్లూరులోని డా.బిఆర్ అంబేద్కర్ సేవాసమితి ఆధ్వర్యంలో ఈనెల 11న నగరంలోని ఆర్‌సిఎం స్కూల్లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించి, రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. సేవాసమితి నిర్వాహకుడు రమేష్‌బాబు, డాక్టర్ మాదాల తరుణ్, ప్రశాంత్, దీపికారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పెన్నాతీరంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సోమశిల జలాశయం నుంచి పెన్నానదికి నీరు విడుదల చేయడం జరిగిందని, అందువల్ల పెన్నా పరీవాహక ప్రాంతాల్లో ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నదిలోకి ఎవరూ వెళ్ళకుండా రెవెన్యూ సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కడా ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని అధికారులు తెలిపారు.

### దేవాంగులంతా సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

జిల్లాలోని దేవాంగులు తమ పిల్లలను బాగా చదివించుకోవాలని, అందరూ సమాజసేవా కార్యక్రమాల్లో ముందుండాలని దేవాంగుల సంక్షేమ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈనెల 11న ఇందుకూరుపేటలో జరిగిన ఆ సంఘం సమావేశంలో నాయకులు సజ్జా వెంకటసురేష్, కొండా మాధవయ్య, తాళ్ళ నరసింహస్వామి, పేరిశెట్ల శివకుమార్, ముక్త్యాల నరేంద్ర, పమజుల శ్రీనివాసులు పాల్గొని దేవాంగుల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను చర్చించుకున్నారు.

### నిమ్మకాయల ధరలు బాగానే పెరిగాయి

ఇటీవల నిమ్మ ధరలు బాగానే పెరిగాయి. నిమ్మ మార్కెట్లో నిమ్మకాయల లూజు బస్తా ధర 5300 రూపాయల దాకా పెరగడంతో వ్యాపారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని పొదలకూరు, కలువాయి. చేజర్ల, రాపూరు మండలాల నుంచి నిమ్మకాయలను వివిధ ప్రాంతాలకు ఎగుమతిచేస్తున్నారు.

### నెల్లూరు చంద్రమౌళీశ్వరాలయంలో వైభవంగా చండీ హోమం

నెల్లూరు మూలాపేటలోని కంచికామక్షమ్మ చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో ఇటీవల చండీయాగం వైభవంగా నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లా నుంచి వచ్చిన వేదపండితుల ఆధ్వర్యంలో, ఆలయ అర్చకుల నేతృత్వంలో ఈ హోమం జరిగింది. ఆలయ మేనేజర్ కె.నందకిషోర్, కార్యనిర్వాహకురాలు ఉషాకుమారి తదితరులు పర్యవేక్షించారు.

### దోమల నుంచి కాపాడండి బాబోయ్

నెల్లూరులో విపరీతంగా పెరిగిపోతున్న దోమల నుంచి ప్రజలను కాపాడాలంటూ డివైఎఫ్ఐ 15వ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని సచివాలయం వద్ద ఈనెల 12న ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. వీధుల్లో ఫాగింగ్ చేయించి దోమలను నియంత్రించాలని నాయకులు జగదీష్, రమణ, నరసింహ తదితరులు అధికారులను కోరారు.




## నెల్లూరులో 'నాటా' అధ్యక్షుడు

నార్త్‌అమెరికన్ తెలుగు అసోసియేషన్(నాటా) అధ్యక్షులు, మన నెల్లూరీయుడు డాక్టర్ శ్రీధర్ కోర్శపాటి జిల్లాలో పర్యటించారు. వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవి సన్నారెడ్డి తదితర ప్రముఖులను ఆయన కలుసుకున్నారు. 2023 జూన్ చివరి వారంలో అమెరికాలో జరగనున్న 'నాటా ద్వైవార్షిక సమావేశాలకు' వారిని ఆహ్వానించారు. డిసెంబర్ 2022లో నెల్లూరులో జరగనున్న 'నాటా సేవా డేస్' కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కూడా డాక్టర్ శ్రీధర్ కోర్శపాటి వీరిని కోరారు.




### వేదగిరి లక్ష్మీ నృసింహునికి...

## వైభవంగా స్వర్ణ గరుడోత్సవం



నెల్లూరు రూరల్ మండలంలోని నరసింహ కొండలో ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ వేదగిరి లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ఇటీవల స్వామివారిని బంగారు గరుడునిపై వేంచేపు చేసి గిరిప్రదక్షిణ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని పూలమాలికలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మూలవిరాట్టుకు, ఉత్సవమూర్తులకు విశేష అభిషేకాలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పాలక మండలి ఛైర్మెన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, కార్యనిర్వహణాధికారి గిరికృష్ణ పర్యవేక్షించారు.

## పడారుపల్లిలో దొంగలుపడ్డారు

### షట్టర్ పగులగొట్టారు..సొమ్ము కాజేశారు

ఇళ్లకు వేసిన తాళాలనే కాదు, దుకాణాల షట్టర్లకు వేసిన తాళాలను కూడా పగులగొట్టి లోపలున్న సొమ్మంతా దోచుకుపోతున్నారు దొంగలు. నెల్లూరుజిల్లాలో ఇళ్లల్లోనే కాదు, దుకాణాల్లో కూడా ఇటీవల దొంగతనాలు పెరిగిపోతున్నాయి. తాజాగా ఈనెల 13వ తేది రాత్రి నెల్లూరు శివార్లలోని పడారుపల్లి దివ్యాంగుల కాలనీలో దొంగలుపడ్డారు. అక్కడ ఓ కిరాణాకొట్టుకు ఉన్న షట్టర్ తాళాలను పగలగొట్టి దుకాణంలో ఉన్న లక్ష రూపాయలకు పైగానే డబ్బును దోచుకుపోయారు. దుకాణం యజమాని వెంకటనరసింహులు పొద్దున్నే వచ్చి చూసుకుంటే ఇంకేముందీ..క్యాష్ కౌంటర్‌లో ఉన్న డబ్బంతా పోయింది. లబోదిబోమంటూ వేదాయపాళెం పోలీసులకు ఈ దొంగతనం గురించి ఫిర్యాదుచేశాడు. ఇలాంటి ఘటనలతో నగరంలోనే కాక, జిల్లా వ్యాప్తంగా దుకాణదారులు, స్టాల్స్ యజమానులు, ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పోలీసులు రాత్రివేళ గట్టి నిఘా ఏర్పాటు చేసి దొంగతనాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## 'ముందస్తు'తోనే ముందరకాళ్ళకు బంధం

(మొదటి పేజీ తరువాయి)

భారతీయ జనతా పార్టీతో తెలుగు దేశం జతకట్టబోతోందన్న పుకార్లు ఇటీవలి కాలంలో బాగా షికార్లు చేస్తున్న తరుణంలో, ఆంధ్ర రాజకీయాలలో ఊహించని మార్పులు జరుగుతాయని జోస్యం చెప్తున్నారు రాజకీయ విశ్లేషకులు. షెడ్యూల్ ప్రకారమైతే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు 2024 ఏప్రిల్ లేదా మేలో జరగాలి. కానీ రాష్ట్రంలో మారుతున్న రాజకీయ వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకుని 6నెలల ముందే అసెంబ్లీ ఎన్నికల తంతును ముగించాలని జగన్ భావిస్తున్నట్టు తాడేపల్లి వర్గాల భోగట్టా. 2024 వరకూ వేచిచూస్తే అప్పటికి భాజపా, తెదేపా ఒక్కటైపోయి వారికి జనసేన కూడా తోడైతే వైసీపీకి గట్టి పోటీ ఇచ్చే అవకాశం లేకపోలేదన్న సమాచారాన్ని ఇంటెలిజన్స్ వర్గాలు అధినాయకుడికి చేరవేశాయన్నది వారినుండి వస్తున్న సమాచారం. ఇలాంటి పరిస్థితులలో అసెంబ్లీ ఎన్నికలను ముందుగానే జరుపుకుని తమ బలాన్ని నిరూపించుకోవాలన్నది పార్టీ అధ్యక్షుడి ఆలోచనని చెప్తున్నారు. సార్వత్రిక ఎన్నికల సమయానికి ఆ మూడు పార్టీలు ఒక్కటైతే అన్ని విధాలా తమకు ఇబ్బందులు కలిగే అవకాశాలుంటాయి కాబట్టి శాసనసభ ఎన్నికల తంతుని ముందుగానే ముగిద్దామని కూడా జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన సన్నిహితులు సూచించినట్లు తెలుస్తోంది. ఈ ప్రతిపాదనకు ఆయన కూడా సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. ఇదే విషయాన్ని కొంతమంది పార్టీ నాయకులతో కూడా జగన్ చర్చించినట్లు తెలుస్తోంది. వాళ్ళు కూడా అలాంటి పరిస్థితే వస్తే మనం ముందుగా ఎన్నికలకు వెళ్లడమే మంచిదని చెప్పారని వార్త.

### 'పొత్తు' పొడవక ముందే చిత్తు చేయాలి...

తెదేపా, భాజపా పొత్తు పొడవక ముందే తమ సత్తా చూపించి భాజపా ఆలోచనకి బ్రేకులు వేయాలన్నది వైకాపా ఆలోచనగా విశ్లేషకులు చెప్తున్నారు. నవంబర్ లేదా డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరిగితే వైసీపీకి మళ్ళీ ఎక్కువ సీట్లు వస్తాయన్నది పార్టీ శ్రేణుల ధీమా. భారీ సీట్లతో పార్టీ మళ్ళీ అధికారంలోకి వస్తే తమకు తిరుగుండదని వారి ఆలోచన. ఇప్పటికే కేంద్రంలో రెండుసార్లు అధికారంలోకి వచ్చిన కమలం పార్టీ మూడవసారి కూడా రావడానికి అన్ని పావులూ కదుపుతోంది. అందులో భాగంగానే టీడీపీతో మళ్ళీ దోస్తీకి ఆసక్తి చూపుతుందన్నది విశ్లేషకుల అభిప్రాయం. అయితే ఒకవేళ జగన్ ముందస్తు ఎన్నికలకు వెళ్ళి ఘన విజయం సాధించి రాష్ట్రంలో తనకున్న బలాన్ని, బలగాన్ని ప్రదర్శించుకోగలిగితే, తెదేపా వైపు భాజపా కన్నెత్తికూడా చూడదు. ఒకవేళ కేంద్రంలో తమకు పూర్తి మెజారిటీ రాకపోతే అప్పుడు అవసరానికి ఉపయోగపడే గెలుపు గుర్రాల వైపే ఆ పార్టీ మొగ్గు చూపిస్తుంది తప్ప ఎత్తిపోయే వారిపైన కాదు. ఇదే ఆలోచనతో జగన్ వేరు వేరుగా ఎన్నికలకు వెళ్ళే వ్యూహరచన చేస్తున్నట్లు పార్టీ వర్గాల సమాచారం.

ఇప్పటికే పార్టీలో అంతర్గత మార్పులు మొదలుపెట్టేశారు. ఖచ్చితంగా ఓడిపోతారనుకున్న స్థానాల్లో ఇన్‌ఛార్జుల నియామకానికి కసరత్తు చేస్తున్నారు. ఇప్పుడిప్పుడే పాత రోడ్ల మరమ్మత్తులకు, కొత్త మార్గాల నిర్మాణానికి లైన్ క్లియర్ చేస్తున్నారు. గురువారం నుండి మొదలైన శాసనసభ సమావేశాలలో పాలనా వికేంద్రీకరణపై దృష్టిపెట్టారు. అధినేతపై అలిగి పార్టీకి దూరంగా ఉన్నవారిని పిలిచి బుజ్జగిస్తున్నారు. "సినిమా ఇంటర్వెల్ వరకూ ఎలా ఉన్నా పరవాలేదు. ద్వితీయార్థం అద్భుతంగా ఉంటే ఆ చిత్రం సూపర్ హిట్టే. అదే ఫార్ములాను జగన్ అమలుచేయబోతున్నారు. త్వరలో మళ్ళీ జనంలోకి రాబోతున్నారు. రాబోయే రోజుల్లో పార్టీలో ఊహించని మార్పులు చేయబోతున్నారు. మా నాయకుడికి తిరుగులేదు, ఆయన ఆశయాలకు, ఆలోచనలకూ ఎదురు లేదు. మళ్ళీ మేమే గెలుస్తాం..." ఇవీ పార్టీలోని ఓ వర్గం నుండి వినిపిస్తున్న మాటలు. బీజేపీ, టీడీపీ కలవకుండా ఉండాలంటే ముందరకాళ్ళకి బంధం వేయాలి, అందులో భాగమే ముందస్తు ఎన్నికల వ్యూహం అంటున్నారు విశ్లేషకులు.

## ఆయన రూపం.. ఇక 'అమరదీపం'

(మొదటి పేజీ తరువాయి)

***సినీరంగంలోనే కాక రాజకీయ రంగంలోనూ తనదైన పాత్ర పోషించి.. కేంద్రమంత్రిగా కూడా ప్రజలకు సేవలందించిన కృష్ణంరాజు 82 ఏళ్ళ వృద్ధాప్యంలో అనారోగ్యం పీడించగా, హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సెప్టెంబరు 11వ తేదీ ఆదివారం వేకువన తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో సినీలోకం శోకతప్తమైంది. తెలుగునేల ఒక మహానటుడిని, ఒక మంచి నాయకుడిని కోల్పోయినట్లయింది.***

సినీరంగంలో హీరో కృష్ణంరాజు సినిమాలంటే ఎంతో ప్రత్యేకతతో ఉండేవి. కొందరు నటిస్తే అది నటన అని తెలుస్తూనే ఉంటుంది. ఇంకొందరు నటిస్తే అది సహజంగానే ఉన్నట్లనిపిస్తుంది. ఈ రెండో కోవకు చెందిన వారే కృష్ణంరాజు. అందుకే ఆయన నటనే కాదు, ఆయన నటించే సినిమాలు కూడా ప్రత్యేకంగానే ఉంటాయి. వీర రసం, రౌద్రరసం పోషణలో ఆయన పెట్టింది పేరు. విలక్షణమైన నటనా చాతుర్యం ఆయన సొంతం. హీరోగా నటించినా, విలన్‌గా కనిపించినా ఆ సినిమాలన్నీ హిట్టే. ఆయన నటనలో వాచకం, అభినయం, ఆహార్యం అన్నీ సమతూకంలో ఉంటాయి. ఆ పాత్రలు ఆయనలో అమరిపోతాయి.

1940 జనవరి 20వ తేదీన పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరులో ఆయన జననం. డిగ్రీ పూర్తయ్యాక సినిమాలపై మక్కువతో మద్రాసుకు వచ్చారు. మొదటి భార్య రోడ్డుప్రమాదంలో మృతిచెందడంతో శ్యామలాదేవిని రెండవ వివాహం చేసుకున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు ప్రసీద, ప్రకీర్తి, ప్రదీప్తి. కృష్ణంరాజు సోదరుని కుమారుడే నేటి ప్రముఖ హీరో ప్రభాస్. ప్రభాస్ 'బాహుబలి' హీరోగా ప్రపంచవ్యాప్తంగా పేరొందిన విషయం తెలిసిందే.

### 'చిలకా గోరింక'తో సినీరంగ ప్రవేశం

1966లో కృష్ణంరాజు సినీరంగంలో ప్రవేశించారు. తొలి చిత్రంలోనే హీరోగా నటించారు. 'చిలకా గోరింక'లో ఆయన నటన అందరినీ ఆకట్టుకుంది. ఇక ఆనాటి నుంచి తిరిగిచూసింది లేదు. ప్రేక్షకుల ఆదరణతో ఆయన నటించిన చిత్రాలు దాదాపు అన్నీ సూపర్‌హిట్ చిత్రాలయ్యాయి. ఆ నటనా ప్రతిభ ఏమాత్రం తగ్గకుండా ఇటీవలి దాకా సుమారు 183 చిత్రాల్లో ఆయన నటించడం గొప్ప విశేషం. కృష్ణంరాజు సినిమా అంటే సూపర్‌హిట్ అనే పేరు తెచ్చుకున్నారు. మనవూరి పాండవులు, రంగూన్ రౌడీ, సీతారాములు, త్రిశూలం, అంతిమ తీర్పు, కటకటాల రుద్రయ్య, నిప్పుతో చెలగాటం, గోల్కొండ అబ్బులు, ప్రళయ రుద్రుడు, తాండ్రపాపారాయుడు, పులి బెబ్బులి, కురుక్షేత్రం, రుద్రమదేవి, జీవన తరంగాలు, బిల్లా, ఇటీవలే విడుదలైన రాధేశ్యామ్ ఇలా ఒకటేమిటి..ఎన్నో చిత్రాలు ఆయన నటనాప్రావీణ్యతకు నిదర్శనాలుగా నిలిచాయి. అమరదీపం, కృష్ణవేణి, బొబ్బిలి బ్రహ్మన్న చిత్రాల్లో ఆయన నటనకు 'నంది' అవార్డులు వచ్చాయి. తెలుగు సినిమారంగంలో నంది అవార్డులు అందుకున్న తొలి ఉత్తమనటుడు కూడా కృష్ణంరాజు కావడం విశేషం. అంతేకాదు, స్వయంగా పలు చిత్రాలు నిర్మించి గొప్ప నిర్మాతగా కూడా ఆయన రాణించారు. నటనే జీవితంగా..జీవితమే నటనగా అంకితభావంతో దశాబ్దాల తరబడి నటనారంగంలో ఉంటూ, సమాజాభ్యుదయాన్ని కోరుకుంటూ ఆణిముత్యాల వంటి సినిమాలందించిన కళామతల్లి ముద్దుబిడ్డ.. కృష్ణంరాజు.

ఏదేమైనా..సినీరంగలో వెండితెర రారాజుగా, రాజకీయాల్లోనూ రాజుగా వెలిగిన ఆ మహానటుడు..ఇక లేరనే బాధ అందరినీ కలచివేస్తోంది.

ఆయన రూపం ఇక 'అమరదీపం'గా మిగిలింది.



### రాజకీయాల్లోనూ రాణించిన మహానటుడు

సినిమా రంగంలో ఉన్నా రాజకీయరంగంలోకి వచ్చి ప్రజలకు సేవ చేయాలనే తపన ఉన్న నటుడు..కృష్ణంరాజు. ఆ ఆసక్తితో కాంగ్రెస్‌లో చేరి 1991లో పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం లోక్‌సభ నుంచి పోటీచేసి అపజయం పాలైనా, ఆ తర్వాత 1998లో బిజెపిలో చేరి కాకినాడ లోక్‌సభ స్థానం నుంచి విజయం సాధించారు. అంతేకాదు, 1999లో టిడిపి–బిజెపి మిత్రపక్షం అభ్యర్థిగా నరసాపురం నుంచే మళ్ళీ పోటీచేసి భారీ మెజార్టీతో ఘనవిజయం సాధించి 'దటీజ్ కృష్ణంరాజు' అనిపించుకున్నారు. లోక్‌సభలో బిజెపి విప్‌గా బాధ్యతలు చేపట్టి, 2000వ సంవత్సరంలో వాజ్‌పేయి ప్రభుత్వంలో విదేశీ వ్యవహారాల శాఖకు సహాయమంత్రి అయ్యారు. రాజకీయాల్లో బాగా రాణించినా.. ఆ రంగంలో ఆయన ఎన్నో ఒడిదుడుకులు కూడా ఎదుర్కొన్నారు. ఎంపీగా పదవీ కాలం ముగిసిన తర్వాత రాజకీయాలకు దూరంగా ఉన్నారు. చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ పెట్టడంతో ఆ పార్టీలో చేరి రాజమండ్రి నుంచి లోక్‌సభకు పోటీచేసినా అపజయం ఎదురైంది. ఆ తర్వాత మళ్ళీ బిజెపిలో చేరి.. చివరిదాకా ఆయన బిజెపిలోనే ఉన్నారు.

# అరాచకస్వామ్యం దిశగా... మన ప్రజాస్వామ్యం!!

మన రాజ్యాంగంలోని ఆర్టికిల్–75 వల్ల రాజకీయపార్టీలకు చట్టసభలలో గుర్తింపు లేకుండా పోయింది. ఈ అధికరణ ప్రకారం లోక్‌సభలో మెజారిటీ సభ్యుల మద్దతు గలిగిన సభ్యుడిని ప్రధానమంత్రిగా భారత రాష్ట్రపతి నియమిస్తారు. రాష్ట్రాలలో అయితే, శాసనసభలో మెజారిటీ సభ్యుల మద్ధతు కలిగిన వ్యక్తిని ముఖ్యమంత్రిగా గవర్నర్ నియమిస్తారు.

అంతే! ఇక, ఆ తరువాత వారెవరికీ బాధ్యత వహించరు. రాజ్యాంగం ప్రసాదించిన 'హక్కు'తో వారు మానవాతీత శక్తులుగా ప్రవర్తించడాన్ని మనం చూస్తున్నాం. వారు ప్రజలకు అసలే బాధ్యత వహించరు. వారు ఆడింది ఆట... పాడింది పాట. ఇచ్చింది జీవో. చేసింది శాసనం. మాట్లాడింది సుమతీ శతకం. ఈ ప్రజాస్వామిక వ్యవస్థ తమ కోసమే అన్నట్టుగా వ్యవహరిస్తుంటారు.

హంతకులు, రేపిస్టులు, దొంగలు, ఫోర్జరీలు చేసిన వారు, కబ్జాకోరులు, రౌడీషీటర్లు చట్టసభల్లో తిష్ట వేయకుండా మన రాజ్యాంగం, మన ప్రజాస్వామ్యం నిలువరించలేకపోతున్నందునే వారి చేతుల్లో భరతమాతకు ఇన్ని కష్టాలు.

ఎన్ని రకాల కేసులు ఉంటే... అంత స్టేటస్ సింబల్‌గా భావించే దశకు మనం చేరుకున్నాం. నేర చరిత్ర అనేది... రాజకీయానికి అదనపు అలంకారంగా మారినట్టు కనబడుతుందని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు కూడా ఇటీవల ఒక సభలో ఆవేదన వ్యక్తం చేశారు.

స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలయిందంటూ ఉత్సవాలు జరుపుకుంటున్నాం కదా...

★ రాజకీయ విలువలు అప్పటికంటే ఇప్పుడు పెరిగాయా.... తరిగాయా?
★ రాజకీయ నేతలలో అవినీతి మనస్తత్వం అప్పటి కంటే ఇప్పుడు పెరిగిందా... తరిగిందా?
★ రాజకీయ నేతలపై సమాజంలో గౌరవం అప్పటికంటే ఇప్పుడు పెరిగిందా.... తరిగిందా?
★ రాజకీయ దోపిడీ అప్పటికంటే ఇప్పుడు పెరిగిందా... తరిగిందా?
★ రాజకీయ నైతిక ప్రమాణాలు అప్పటికంటే ఇప్పుడు పెరిగాయా... తరిగాయా?
★ నేరగాళ్లు రాజకీయాలను ఆక్రమించడం అప్పటికంటే ఇప్పుడు పెరిగిందా... తరిగిందా?
★ ఇది ఈ 75 ఏళ్ళల్లో మన సమాజం సాధించిన అభివృద్దా... పతనమా?
★ ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే... యువత, భవిష్యత్ తరాల పరిస్థితి ఏంటి?
★ స్వతంత్రం వచ్చిన 75 ఏళ్లకు ఇలా ఉంటే... 100 ఏళ్లకు ఎలా ఉండవచ్చు?

రాజకీయ సభ్యత, సంస్కారాలు సిగ్గుపడుతూ ఇంట్లో దాక్కుంటుంటే... అరాచకం, అసభ్యత 'బట్టలు ఊడదీసుకుని' మరీ నడి బజారులో నాట్యం చేస్తున్నాయి. 'ఇక రేపు అనేది లేదు. అరాచకమంతా ఈరోజే చేసెయ్యాలి' అన్నట్టుగా రాజకీయ అరాచకం చెలరేగిపోతున్నది.

ఈ బరితెగింపుకు కారణాలు లేకపోలేదు.

రాజకీయ పార్టీలు గాకుండా... వాటి తరఫున అభ్యర్థులు ఎన్నికల్లో పోటీచేస్తూ ఉండడమే ప్రస్తుతం మనం చూస్తున్న సర్వ అనర్థాలకూ, అరాచకాలకూ మూలం.

సర్వ అక్రమాలకూ, నేర ప్రవృత్తికి కేర్ ఆఫ్ అడ్రస్‌గా తయారైన వారు... ఏదో ఒక పార్టీ ముసుగులో చట్టసభల్లోకి చొరబడడానికి ప్రయత్నించే ట్రెండ్ రోజురోజుకూ విపరీతంగా పెరిగిపోతోంది. ప్రస్తుత విధానంలో ఎన్నికల్లో కోట్లకుకోట్లు మంచి నీళ్ళలా పారించడం... ఓట్లను కొనుగోలు చేయడం, ప్రత్యర్థులపై మూకుమ్మడి దౌర్జన్యాలకు పాల్పడడం, పోలింగ్‌బూత్‌ల రిగ్గింగ్, తమకు ఓటు వేయరేమోనని అనుమానం ఉన్న ఓటర్లపై దాడులు చేయడం వంటి అరాచక వ్యవహారశైలికి ప్రతినిధులుగా రూపొందుతున్నారు. ఖర్చుపెట్టిన దానికి వంద రెట్లు పోగెయ్యడానికి దౌర్జన్యాలు, కబ్జాలు, కాంట్రాక్టులు, కమిషన్లు, మాఫియాల్లో మునిగి తేలుతున్నారు. ఫలితంగా రాజకీయాలు అంటే సమాజంలో గౌరవం లేకుండా పోయింది. పోతోంది. ఈ పరిస్థితులకు చెక్ పెట్టడానికి... ఒకే ఒక మార్గం ఉంది.

అదే.. అభ్యర్థుల స్థానంలో రాజకీయ పార్టీలు పోటీ చేయడం.

దీనివల్ల, ఎన్నికల దౌర్జన్యాలు, డబ్బు ప్రలోభాలు దాదాపుగా కనీస స్థాయికి దిగిపోతాయి. నియోజకవర్గాల్లో 'పొలిటికల్ లార్డ్స్' లాగా ఎంపీలు, ఎం.ఎల్.ఏలు వ్యవహరించే పరిస్థితి ఉండదు. చట్టసభలకు వచ్చే సభ్యుల్లో 'ఊహాతీతమైన రాజకీయ క్రమశిక్షణ' చోటు చేసుకుంటుంది. రాజకీయాలలో సర్వ రుగ్మతలకు మూలమైన వ్యక్తి పూజ, వ్యక్తి ప్రాధాన్యత దాదాపు పూర్తిగా తగ్గిపోతుంది. అభ్యర్థుల స్థానంలో రాజకీయపార్టీలే నేరుగా ఎన్నికల్లో పోటీచేసే ఎన్నికల వ్యవస్థను ప్రవేశపెడితే, అనేక రాజకీయ రుగ్మతలకు విరుగుడు కనపడుతుంది.


రాజ్యాంగంలోని 75వ ఆర్టికల్ ప్రకారం లోక్‌సభలోని మొత్తం సభ్యుల్లో మెజారిటీ సభ్యుల మద్దతుగల సభ్యుడిని ప్రధానమంత్రిగా రాష్ట్రపతి నియమిస్తారు. రాష్ట్రాలలో అయితే ముఖ్యమంత్రి నియామకానికి కూడా ఇదే తరహా నిబంధనలు వర్తిస్తాయి. ఇక్కడ కూడా పార్టీల ప్రస్తావన ఉండదు.

ఈ పరిస్థితులలో వ్యక్తి ప్రాధాన్యతను తొలగించడం సాధ్యమా అంటే... కేంద్ర ప్రభుత్వం తలుచుకుంటే సాధ్యం కానిదేమీ ఉంటుంది!?

వ్యక్తులకు కాకుండా, పార్టీలకే చట్ట సభలలో గుర్తింపు లభించిన పరిస్థితుల్లో చాలా దుర్మార్గాలకు తెరపడుతుంది.

ఒక ఉదాహరణగా... మన శాసనసభను తీసుకుందాం. రాష్ట్రం మొత్తం ఒకటే యూనిట్‌గా రాజకీయ పార్టీలు పోటీ చేస్తాయి.

శాసనసభలో గల 175 స్థానాలకు ముందుగానే 175 మంది తమ పార్టీ సభ్యుల పేర్లను ఎన్నికల ప్రకటనకు ముందుగానే (ఎన్నికల సంఘం నిర్దేశిత




గడువు ప్రకారం) ఎన్నికల సంఘానికి రాజకీయ పార్టీలు సమర్పించాలి. వీటిని పబ్లిక్ డొమైన్‌లో ఎన్నికల కమిషన్ పెడుతుంది కనుక రహస్యం ఏమీ ఉండదు.

అందువల్ల, అన్ని రాజకీయ పార్టీలు, తమ తమ పార్టీ సభ్యుల పేర్లను ప్రాధాన్యతా క్రమంలో పేర్కొంటూ, ఎన్నికల కమిషన్ వద్ద తమ జాబితాలను దాఖలు చేయాలి.

అనంతరం తమ తమ ఎన్నికల ప్రణాళికలతో ఎన్నికలలోకి దిగాలి. ఎన్నికల్లో ఆయా పార్టీలకు వచ్చిన ఓటు శాతాన్ని బట్టి 175 స్థానాల్లో ఆయా పార్టీలకు అసెంబ్లీలో ఎన్ని స్థానాలు అనేది ఎన్నికల కమిషన్, నిర్ణయించి... కేటాయిస్తుంది. ఒకసారి శాసనసభ / లోక్‌సభలో సభ్యత్వం కేటాయింపు జరిగాక ఇక ఆ చట్టసభ కాలపరిమితి తీరేవరకు ఆ సభ్యుడు... పార్టీ ఫిరాయించడం కుదరదు. ఫిరాయించిన మరుక్షణం ఆ చట్టసభ సభ్యత్వం కోల్పోతారు. అంటే.... ఇద్దరు, ముగ్గురు సభ్యుల మెజారిటీ ఉన్నప్పటికీ, ప్రభుత్వాలు పడిపోవు. సభ్యులను కొనుక్కోవలసిన పని పడదు. కొనుగోలూ కుదరదు.

గతంలో 23 మంది ఎంఎల్ఏలు వైసీపీలో నుంచి టీడీపీలోకి, ఇప్పుడు ముగ్గురు టీడీపీ లోంచి వైసీపీలోకి ఫిరాయించి కూడా... శాసనసభ సభ్యులుగా కొనసాగుతున్నట్టుగా కొనసాగడం కూడా కుదరదు. నిజానికి ఈ విధానం ఇప్పటికే అమలులో ఉండి ఉంటే కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో ఎన్నికైన ప్రభుత్వాలకు కాలం చెల్లి ఉండేది కాదు కదా!

ఈ విధానంలో ఏమి జరుగుతుందో ఇప్పుడు చూద్దాం.

ఉదాహరణకు వైసీపీకి గత ఎన్నికల్లో దాదాపు 50 శాతం ఓట్లు లభించాయి. కనుక, 175లో 50 శాతం సీట్లు వైసీపీకి కేటాయిస్తారు. అంటే... 88 స్థానాలు అనుకుంటే గతంలో ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన 175 మంది సభ్యుల జాబితాలోంచి, మొదటి 88 మంది సభ్యులను శాసన సభ్యులుగా ఎన్నికల కమిషన్ గుర్తిస్తుంది. అలాగే, టీడీపీకి వచ్చిన 40 శాతం ఓట్లకు అనుగుణంగా... ఆ పార్టీ జాబితా నుంచి 175లో మొదటి 40 శాతం పేర్లను శాసనసభ్యులుగా గుర్తిస్తారు. జనసేనకు 175లో ఆరు శాతం వాటా సభ్యులు వస్తారు.

ఒక్క శాతం మాత్రమే ఓట్లు తెచ్చుకునే పార్టీకి కూడా శాసనసభలో రెండు స్థానాలు లభిస్తాయి. ఆ విధమైన శాసనసభ... ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబిస్తుంది.

అదే లోకసభకు వచ్చేసరికి లోక్‌సభ దేశంలోని 29 రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. కనుక, ఏ రాష్ట్రం నుంచి లోక్‌సభకు పోటీ చేయాలి అనుకుంటున్న పార్టీ... ఆ రాష్ట్రంలోని లోక్‌సభ సభ్యుల సంఖ్యకు అనుగుణంగా తమ సభ్యుల పేర్లను ప్రాధాన్యతా క్రమంలో పేర్కొంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించాలి. ఫలితాల అనంతరం, ఒక్కొక్క రాష్ట్రం నుంచి ఆయా పార్టీలు సాధించిన ఓట్ల శాతానికి అనుగుణంగా రావలసిన స్థానాల సంఖ్యను నిర్ధారించి, ఆ రాష్ట్రానికి సంబంధించిన జాబితాలోని సభ్యులను లోక్‌సభ సభ్యులుగా ఎన్నికల సంఘం ప్రకటిస్తుంది.

ఈ విధానంలో ఎంఎల్ఏలకు గానీ, ఎంపీలకు గానీ సొంత నియోజక వర్గాలు ఉండవు. అందువల్ల సొంత ప్రయోజనాల పట్ల ఆసక్తి ఉండదు. ప్రతి సభ్యుడు మొత్తం రాష్ట్ర ప్రయోజనాల దృష్టితో ఉంటారు. వీరి వ్యవహారశైలికి వారి వారి పార్టీలు బాధ్యత వహించవలసి ఉంటుంది. అందువల్ల వీరు గడప... గడప ఎక్కి దిగాల్సిన పని ఉండదు.

దీనివల్ల, ఎన్నికల్లో అక్రమాలు దాదాపుగా కనుమరుగైపోతాయి. అధికార దుర్వినియోగ అవసరం పడదు. అసెంబ్లీ సమావేశాలు ఇప్పటిలా 20, 25 రోజులు కాకుండా... హాయిగా 100, 125 రోజులు నిర్వహించుకోవచ్చు.

ఈ సభ్యుల జాబితా తయారీ సమయంలోనే... సంఘవ్యతిరేక, అవాంఛనీయ, కబ్జా, దౌర్జన్య, మాఫియాలతో అంటకాగే శక్తులను పక్కన పెట్టవచ్చు.

ఈ జాబితాలు ప్రజలకు ముందుగానే తెలుస్తాయి కనుక అభ్యర్థుల గుణగణాలు, అర్హతలు ఎన్నికల ఫలితాన్ని ప్రభావితం చేస్తాయనే 'భయం' ఆయా పార్టీ నేతలకు ఉంటుంది.

పబ్లిక్ పెర్సెప్షన్‌ను రాజకీయపార్టీలు పరిగణనలోకి తీసుకోక తప్పనిస్థితి ఏర్పడుతుంది. పార్టీలు ప్రచారం చేసుకోడానికి ప్రభుత్వమే నేరుగా నిధులు మంజూరు చేయవచ్చు.

ఈ రీతిగా ఎన్నికల ప్రక్రియను పట్టిపీడిస్తున్న సమస్త రుగ్మతలకు 'సంస్కరణల కషాయం' పట్టించాల్సిన తక్షణావశ్యకతపై సామాజిక స్పృహ కలిగిన మేధావులు, (మాజీ )న్యాయమూర్తులు, న్యాయవాదులు, వైద్యులు, సోషల్ ఏక్టివిస్టులు, స్వచ్ఛంధ సేవకులు, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, రిటైర్ అయిన ఐఏఎస్, ఐపీఎస్ వంటి సివిల్ సర్వెంట్లు(రిటైర్ అయ్యాకే వారి మెదళ్ళు యాక్టివేట్ అవుతాయంటారు), యువకులు, సమాజ శ్రేయోభిలాషులు మొదలైన వారందరూ కదలాలి. భావి తరాల శ్రేయస్సు దృష్ట్యా వీరంతా నడుం బిగించాలి. ఇప్పటిదాకా మనం గౌరవంగా... దర్జాగా... స్వేచ్ఛగా బతికినట్టుగా మన పిల్లలు... వారి పిల్లలూ... వారి పిల్లలూ... ఎవరి బతుకు వారు బతకాలి కదా! సృష్టిధర్మం మనతోనే ఆగిపోవడం లేదు కదా!

ఈ ఎన్నికల సంస్కరణ అంశంలో మరింత స్పష్టత కావాలి అనుకుంటే... నెదర్లాండ్స్ వెళ్లి... అక్కడి ఎన్నికల వ్యవస్థ నిర్వహణ తీరును అధ్యయనం చేసి రావచ్చు. నెదర్లాండ్స్‌ను హాలెండ్ అని కూడా అంటారు.

అక్కడి పార్లమెంట్‌కు పార్టీలే పోటీ చేస్తాయి. అభ్యర్థులు కాదు. పార్టీల ప్రచార వ్యయాన్ని ప్రభుత్వమే భరిస్తుంది. సుమారు రెండుకోట్లకు అటు ఇటుగా జనాభా ఉన్న అంత చిన్న దేశంలోనే, ప్రజాస్వామిక వ్యవస్థకు అంత గౌరవం లభిస్తుంటే రమారమి 140కోట్ల జనాభాతో, సగం మంది అన్నెం పున్నెం ఎరుగని జనంతో కిటకిటలాడుతున్న మన దేశంలో ప్రజాస్వామ్యం అరాచక కశ్మలంలో చిక్కుకు పోయినట్టుగా తయారైంది.

కళ్ళ ఎదురుగా జరుగుతున్న అరాచక, బూతు 'నగ్న' రాజకీయాలకు ఫుల్‌స్టాప్ పెట్టడానికి ఎన్నికల సంస్కరణలే శరణ్యం. చట్టసభలకు అభ్యర్థుల స్థానంలో రాజకీయపార్టీలే పోటీచేసే విధంగా కేంద్రం చర్యలు తీసుకోవాలి.

లేకపోతే, మనకు 75 ఏళ్ళ క్రితంనాటి నేతలు పెట్టిన ఈ ప్రజాస్వామిక భిక్ష... ఈన గాచి నక్కల పాలు చేసినట్టు అవుతుంది. మన డెమోక్రసీ... 'అరాచకాక్రసీ' దిశగా ప్రయాణించడానికి ఇంకా 2, 3 ఎన్నికలకు మించి సమయం పట్టదు.


**- భోగాది వేంకట రాయుడు**

## పెద్దాసుపత్రికి.. 'ప్రియదర్శిని లయన్స్‌క్లబ్' వితరణ

తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని నెల్లూరులోని పెద్దాసుపత్రికి స్థానిక ప్రియదర్శిని లయన్స్‌క్లబ్ వారు ఈనెల 12న రోగులకు అవసరమైన వీల్‌ఛైర్, స్ట్రెచర్‌లను వితరణగా అందజేశారు. ఆసుపత్రిలో ఉన్న గర్భిణులకు పాదరక్షలు, పురిటిపిల్లలకు దుస్తులు, చిన్నారులకు బిస్కెట్లు ఇచ్చారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కోఆర్డినేటర్ లక్ష్మీసునంద, సభ్యుడు శ్రీనివాసులు, క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సువర్ణశేషాద్రి, అఖిల అనుమాల, కోశాధికారి కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో అయిదుగురు తహశీల్దార్లకు స్థానచలనం

జిల్లాలో అయిదుగురు తహశీల్దార్లను బదిలీ చేస్తూ ఇటీవల జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు ఉత్తర్వులిచ్చారు. బుచ్చిరెడ్డిపాళెం తహశీల్దారు శ్రీనివాసులును కొండాపురం మండలానికి, దగదర్తి తహశీల్దారు ప్రమీలను బుచ్చిరెడ్డిపాళేనికి బదిలీ చేశారు. అదేవిధంగా అనంతసాగరం తహశీల్దారు హమీద్‌ను తోటపల్లిగూడూరుకు బదిలీ చేసి, తోటపల్లిగూడూరులో ఉన్న శ్యామలను కలెక్టరేట్‌కు బదిలీ చేశారు. సెలవులో ఉన్న సోమ్లానాయక్‌ను కలువాయి తహశీల్దారుగా నియమించారు.





Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com